# కాలం మీద కన్నీళ్లు రాల్చిన కావ్యం 'సతీస్మృతి'



-డాక్టర్ కె.జి. వేణు
98480 70084

'గోపి – అరుణ' ఇవి కేవలం ఓ దంపతుల పేర్లు కాదు. ఎన్నో జ్ఞాపకాల కొమ్మల్ని అద్భుతంగా మోస్తున్న సంసార వృక్షాన్ని ఎన్నో సంవత్సరాలు బలంగా నిలబెట్ట గలిగిన వేర్ల సంపదే ఆ పేర్లు. కాలాన్ని సారం లేకుండా దొర్లించుకుపోయిన నిస్సార సంసారం కాదు వీళ్లది. సాహిత్య సుగంధాల మధ్య అనురాగపు తాంబూళాలు ప్రేమగా అందించుకున్న ప్రతి సందర్భం, నాణ్యమైన జీవిత వ్యాకరణాన్ని నాణ్యంగా నమోదు చేసుకున్న రూపాలవి. దాంపత్య మానసిక బలానికి అవసరమైన అమృతాన్ని ఆ ఇద్దరి కనురెప్పల చూపుల విస్తర్లనిండా వడ్డించుకున్న అనుభూతుల పర్వాలన్నీ వీరి సంసార కావ్యానికి ముఖచిత్రాలుగా నిలిచిన అదృష్టానికి అవి ఎంతగానో మురిసి పోయాయి. మనిషి కనురెప్పలనుంచి కారే కన్నీటికి సందర్భం ఏదైనాసరే గుండె బావినుండి ఊరే ఊటే ఆ కన్నీళ్లు. సమస్త విషయాల్లో గోపిగారికి సగభాగంగా దశాబ్దాలుగా కొనసాగి, ఆయన ఊపిరికి ప్రాణవాయువుగా అడుగులేసిన వనిత అరుణగారు. ఆమె తన ఆఖరి క్షణాల పొలిమేరల్ని బాధగా దాటుతూ, దీనంగా చూసిన ఆమె చూపుల స్పర్శలనుండి తడిచి ముద్దయిన వేదన, గోపిగారి కలంనుండి జారి విత్తనమై మొలకెత్తిన ఓ దుఃఖపు సాహిత్యపు మొక్కే ఈ 'సతీస్మృతి' కావ్యం. ఇందులో అక్షరాలన్నీ దుఃఖాన్ని, ఒంటరితనాన్ని, బాధను, వేదనను, శూన్యాన్ని, నిశ్శబ్దాన్ని, ఎడారి ఇసుక తుఫానుల బీభత్సాన్ని తమ తలపాగాలుగా మోస్తున్నాయి. ఎన్నో భావోద్వేగాలతో ప్రవహించే ఒక నదీ ప్రవాహ స్వరూపమే ఈ 'సతీస్మృతి' కావ్యం.

అరుణగారు దూరమయ్యాక **'మన మనమల లేతకళ్లు, నన్ను కోలుకోమంటున్నాయి'** అంటూ ఈ కావ్యంలో ఒక చోట రాసిన కవి మాటల వెనక, ఎక్కడో దూరంగా వినిపిస్తున్న దుఃఖపు జలపాతాల హోరు పాఠకుల చెవుల్లో నివాసాల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నాయి. తన భాగస్వామిని మరచిపోలేని కవి మనసు బాల్కానీ నుండి చూస్తూ **'వెళ్తున్న వారిలో ఒక్కరైనా నువ్వు కావాలని కోరుకుంటున్నాను...'** అంటూ లోకం విడిచిన అరుణగారితో నిత్యం సంభాషణ కొనసాగిస్తున్న ఆ కన్నీటి తడి, మరో కావ్యానికి తాను సిరాగా మారిపో తానంటోంది. తలరాతలు ఎలావున్నా నిత్యం జ్ఞాపకాలతో కరచాలనం చేసే చిరునవ్వు ఆమెదంటూ... **'ఇవాళ / సూర్యోదయంలో నీ నవ్వే / రాత్రిపూట / జాబిల్లి వెన్నెలలో నీ దరహాసమే...'** అంటూ ఆమె నవ్వుల చిత్రపటాలలోని రంగుల్ని కవి లెక్కపెడుతున్నాడు. అందరికీ సూర్యుడు ఉదయిస్తే తెల్లారుతుంది. గోపిగారికి మాత్రం అరుణగారి చిరునవ్వుల తాకిడే తన హృదయానికి ఉదయాన్ని అందిస్తుంది. ఇప్పటికీ ఇంట్లో ఒకప్పుడు పిలిచినట్టు గోపిగారు ఆమెను పిలుస్తూనే వుంటారు. ఆమె పలికే సమాధానం కోసం ఆకాశం వైపు దీనంగా ఆయన చూసినప్పుడు, వీస్తున్న గాలి ఆమె చేతులై, ఆయన చెంపలమీద జారుతున్న కన్నీటిని తుడుస్తున్న దృశ్యాలు, అప్రయత్నంగా పాఠకుల కనురెప్పల మధ్య కూడా కురిసే వర్షానికి వేదికల్ని అందిస్తు న్నాయి.






**'నేను జీవితాన్ని / ఇంతగా ప్రేమించడానికి / కారణం నువ్వే...'** అంటూ అరుణగారిని గోపిగారు సంబోధిస్తున్నారు. తనకంటూ ప్రత్యేకంగా ఒక జీవితం లేదని, తన జీవితంలోని ప్రతి రక్తకణం ఆమె ప్రతిబింబమేనని, అందుకే ఆమె, ఆమె జీవితం తనకు ఎంతో ఇష్టంగా మారిపోయాయని, చివరకు ఆమె వెళ్లిపోయాక **'అంతా రిక్తం / విరక్తం / శప్తం / అశక్తం...'** అంటూ ఆవేదన చెందిన గోపిగారు, ఆమె లేకపోవడం **'వెయ్యి క్యాండిల్స్ ఆరిపో యినట్టు'** అంటూ ప్రకటిస్తున్నారు. కొన్ని దృశ్యాలు జీవితాంతం పుట్టుమచ్చల్లా జ్ఞాప కాలలో నిలిచిపోతాయి. మరణం తరువాత అరుణగారి దేహ దహన దృశ్యాలను మరోసారి జ్ఞాపకం చేసుకుంటూ **'నా కొడుకు / బూడిదలోంచి / వాళ్ళమ్మ ఎముకల్ని ఏరుతున్నాడు...'** అంటారు. అక్కడ ఆ కొడుకు తన అమ్మ తనకు పంచిన ప్రేమను ఏరుకుంటున్నాడు. మంటల్లో ఇంకా కాలి పోని అమ్మ చీరకొంగుకోసం ఆశగా వెతు కుతున్నాడు. ఆమె అస్తికల్లోంచి వినిపిస్తున్న జోలపాటను తన తల్లి తనకోసం తిరిగి పాడాలని, ఆ బిడ్డ భోరుమని విలపిస్తున్నాడు. కార్యక్రమాలు ముగించుకొని ఇంటికి వచ్చాక ఇంటి గోడలన్నీ కదిలి విలపిస్తున్నాయి. ఎందుకంటే **'ఆమె భుజం ఎముకల మీదే / ఈ ఇల్లు నిలిచింది...'** అంటూ ఆ ఇంటితో అరుణగారికున్న అనుబంధాన్ని అందిస్తు న్నారు గోపిగారు.

అరుణగారు ఉన్నంతవరకు క్యాలెం డరులోని తేదీలన్నీ తనకు ప్రీతిగా, ప్రియంగా, స్నేహంగా, వెలుతురుగా, ఉత్సాహంగా, ఆశగా, ఆసక్తిగా, అనురాగంగా వుంటూ తనకు అనుకూలంగా ఎన్నో అధ్యాయాలను నిర్మించి ఇచ్చేవి. కానీ సెప్టెంబరు నెలలో 26వ తేదీ మాత్రం ఎంతో కర్కషంగా మారి, తన మాటలు విరిగి పోయేలా, కళ్ల చూపును కోల్పోయేలా చేసిందంటూ.. **'ప్రతి సెప్టెంబరులో / వర్ష ప్రళయం వస్తుంది / ఈ సెప్టెంబర్ లోనే / నా జీవితం వరదలై ముంచెత్తుతుంది...'** అంటారు. ఏ వరదైనా నేలమీద శాశ్వతంగా ప్రవహించదు. కాని గోపిగారి విషయంలో కప్పలా దూకి తన తోడును రాక్షసంగా కబళించిన మృత్యువు మాత్రం, దిగుళ్ల వానలను కురిపించి, విపరీతమైన వరదల్ని నిత్యం అందిస్తూనే వుంది. అందుకే పోటెత్తుతున్న ఆ వరదలు ముక్కలై పోయిన తన హృదయానికి సంబంధిం చినవి. కన్నీటి భారాన్ని మోయలేని తన బ్రతుక్కి సంబంధించినవి. ఆశలు గల్లంతయిన మనసు పగుళ్లకు సంబంధించినవి. తన చుట్టూ చేరిన ఈ వరదల మధ్యలో నిలబడి **'అనుబంధాల్ని త్రెంచుకొని / నువ్వెక్కడికి వెళ్లిపోయావు...'** అంటూ గుండెను గొంతుగా మార్చి, రక్తనాళాలను తీగలుగా మీటుతూ గోపిగారు నిత్యం విలపిస్తున్నారు.

**'గోపి – అరుణ'**
**ఇవి కేవలం ఓ దంపతుల పేర్లు కాదు. ఎన్నో జ్ఞాపకాల కొమ్మల్ని అద్భుతంగా మోస్తున్న సంసార వృక్షాన్ని ఎన్నో సంవత్సరాలు బలంగా నిలబెట్టగలిగిన వేర్ల సంపదే ఆ పేర్లు.**

ఆమెతో జరిగిన పరిచయ సన్నివేశాల గుడారాల క్రిందికి మనల్ని కూడా గోపిగారు ఆహ్వానిస్తున్నారు. ఆమెను ఉద్దేశించి **'కవిత్వమే / మనల్ని కలిపింది / కవిత్వమే / మనల్ని నిలిపింది...'** అంటున్నారు. నిజమే ఆ కవిత్వ పరిచయం ఓ అద్భుతమైన జీవితానికి ఇద్దర్ని భాగస్వాములుగా నిర్దేశించింది. కలిసి జీవించమని, సాహిత్యాన్ని ఒక ఇష్టమైన యుగళగీతంగా ఇద్దరు కలిసి పాడుకొమ్మని దిశా నిర్దేశాలు చేసింది. తాను రాసిన ఏ పద్యం ఏనాడు మధ్యలో ఆగిపోని సంగతుల్ని గోపిగారు గుర్తుచేస్తూ... **'అర్ధాంతరంగా ఆగిన పద్యంలా / అగాధమైన లోయ ఎదురయింది / అంతా చీకటి / అంతులేని ఒంటరితనం / మాటలు కరువు / అలసటలేని దుఃఖం...'** అంటూ వేధిస్తున్న వేదననుంచి ఆయన బయట పడలేని నిజం, నిత్యం ఆయన జీవిత కిటికీల నుంచి తొంగిచూస్తునే వుంది. జీవితంలో మొదటిసారి శూన్యంలో నిలబడిన ఆయన **'54 సంవత్సరాలు / త్రుటిలో దగ్ధమయ్యాయి /జీవించడం దుర్భరం / చివరి అధ్యాయం / చింతాక్రాంతం...'** అంటూ పలికినప్పుడు ప్రపంచంలో నిత్యం జరిగే చర్యలన్నీ ఆయనకు సహజంగా కాకుండా కృత్రిమంగా, తనకు సంబంధంలేని వాటిగా కనబడుతున్నాయి. అందుకే నిరాశ నిండిన దట్టమైన పొగలమధ్య సాగరతీరం దగ్గర నిలబడిన ఆయన, సముద్రపు హోరులో అరుణగారి పిలుపును వింటున్నారు. ఆ పిలుపును విన్న వెంటనే నడుస్తున్న ఇసుక తిన్నెల మీద ఆయన పరుగులుతీస్తూ ఆకాశంలో వున్న ఆమెకు వినిపించేలా **'ప్రియతమా! / ఈ పాతాళంలో నేనుండలేను / నన్ను పైకి చేదుకో...'** అంటూ జీరబోయిన గొంతు కణాలతో ఆయన గట్టిగా దిక్కులు ధ్వనించేలా అరుస్తున్నారు.

**'అమ్మ–ఆమె'** కవితలో ఒక అద్భుతమైన మాట పాఠకుల మనసుల మీద చెరగిపోని ముద్రను ముద్రిస్తోంది. ఆ కవిత ప్రారంభంలో ఆయన **'ఒకప్పుడు / అమ్మలేని వాణ్ణయ్యాను / ఇప్పుడు రెండోసారి / అమ్మను కోల్పోయాను...'** అంటారు. ఈ కవితలోని ప్రతిఅక్షరం ఒక శిలాక్షరమే. తనతో నడిచిన తన భార్య పాదముద్రల్లో తల్లి అడుగుల చప్పుడును వినగలిగిన సంస్కారం ఇక్కడ మనతో కరచాలనం చేస్తోంది. భార్య వడ్డించిన చేతుల్లో తల్లి ఆప్యాయత రేఖల్ని లెక్కకట్టగలిగిన ప్రేమగణిత శాస్త్రవేత్త ఈయన. **'జియే తో జియే కైసే / బిన్ ఆప్ కే'** అనే పాటతో తన జీవితాన్ని అన్వయించుకుంటున్న సమయంలో గోపిగారికి మాత్రమే వినిపించే తన కన్నీటి వాన గుండె చప్పుడ్లు 'క్షమించండి' కవితలో ఆయన జీవితచిత్రంలో వెలిసిపోయిన రంగుల నీడల్ని ఎత్తిచూపుతున్నాయి. ఆమె కదలికల్ని నిత్యం నమోదు చేసుకున్న గోపిగారు, ఆమె తన చిన్ని పాదాలతో చేసిన పెద్ద ప్రయాణాన్ని చెదరిపోని ముద్రలుగా తన ఎద ఇసుక మైదానాల మీద ముద్రించుకుంటూ... **'చెవులకే కాదు / మనసుకూ వినిపిస్తాయి నీ మాటలు...** 'అంటూ అప్పటి సంగతుల్ని జ్ఞాపకం చేసుకుంటున్నారు. ఇద్దరు కలిసి రాళ్లను ముత్యాలుగా మార్చుకున్న వైనాన్ని తిరిగి వాటిని కవిత్వ వంక్తుల్లో తెరిచి పాఠకులందరూ దర్శించుకునేలా చేస్తున్నారు.

పండుగలలోకెల్ల గోపిగారికి ఇష్టమైన పండుగ అరుణగారి పుట్టినరోజు పండుగ. జీవితంలో ఆ రోజును ప్రత్యేకంగా ఆయన గుర్తుపెట్టుకోవలసిన అవసరం ఏనాడు తనకు కలగలేదు. ఆమె పుట్టినరోజు రావడానికి కొద్ది రోజులు ముందే ఆ సువాసనలు ఆయన్ని ఉక్కిరి బిక్కిరి చేసేవి. ఆమె దూరమైపోయి స్వప్నాలన్నీ పీడకలలయ్యాక, రాత్రంటే భయపడుతున్న ఆయన **'నీ పుట్టినరోజు / గుర్తున్నంతగా / నీ మరణం తేదీ / గుర్తుండటం లేదు...'** అంటారు. ఇందులోని ఒక్కొక్క మాట ఆమె ఎడబాటు, ఒక నయంకాని జబ్బులా ఆయన్ని ఎలా పట్టిపీడుస్తున్నదో కవితలోని పదాలన్నీ ఆయన కన్నీటి తెరమీద ఆవిష్కరిస్తున్నాయి. అందుకే సుదీర్ఘమైన జీవితాన్ని చీకట్లో కోల్పోయిన ఈయన ఒకచోట **'అప్పుడు కన్నీళ్లు / కళ్లలోంచే ఉబికేవి / ఇప్పుడు జీవితం సమస్తం / కన్నీటి సముద్రమైంది...'** అంటూ అంతులేని విచారాన్ని వ్యక్తం చేస్తున్నారు. శూన్యానానికి, దైన్యానికి మధ్య స్నేహం కుదిరిన కూడలిమధ్య నిలబడి, అరుణగారు లేని లోటుతో అన్నం మెతుకుల్ని దుఃఖంలో అద్దుకుని తింటున్న గోపిగారు **'కాఫీ టైంలో / కళ్లు మూసుకొని / నా కవిత్వం వినేదానివి / భావకురాలివి / కొన్ని ప్రయోగాలకు / చికిలి పట్టే దానివి...'** అంటూ కవిత్వం పట్ల అరుణగారి ఆస్వాదనను ఈ సందర్భంగా గొప్పగా గుర్తుచేసుకుం టున్నారు.

'జబ్ దిల్ హీ టూట్ గయా / హమ్ జీ కే క్యాకరేంగి ...' మదిలో వినిపిస్తున్న పాటను తన కన్నీళ్లతో స్పర్శిస్తూ 'సైగల్ ఎక్కడున్నావో / ఒక్కసారి కలవాలని వుంది...' అంటూ దుఃఖంతో తడిచిపోతున్న కవి శరీరం చేస్తున్న చప్పుడు, ఈ కావ్యం నిండా ప్రతి కవితలో స్పష్టంగా వినబడుతోంది. ఈ కావ్యాన్ని చదువుతూవుంటే ఏదో ఒక దుఃఖం సముద్రం ఒడ్డున నిలబడ్డ అనుభూతి నీడలా వెంటాడుతోంది. ఈ స్మృతి కావ్యనిండా అన్నీ దృశ్యాలే. అన్ని దృశ్యాలనిండా సజీవంగా అరుణగారు పలకరిస్తున్నారు. ఆమె లేరనే విషయం నిర్ధారణ కావటానికి మనసు ఏమాత్రం వొప్పుకోవడం లేదు. నిజమే, ఈ కవిత్వంలోని విషయాలను పరిశీలించి, ఆయా పరిశోధన ఫలితాలను నిటారుగా నిలబెడితే ఆమె ఇంకా సజీవంగా గోపిగారి హృదయం నిండా జీవించే వున్నారన్న సత్యం, గట్టిగా ఢంకా భజాయించటానికి సిద్ధపడుతోంది. కవితలలోని వాక్యాలన్నీ ఆమె సజీవకత చిత్రపటాలను చేతపట్టుకుని కవాతులను నిర్వహిస్తున్నాయి. అందుకు సాక్ష్యం పలికి సంతకాలు చేయటానికి ఈ రచనలోని ప్రతిఅక్షరం వరుసల్లో నిలబడటానికి పోటీపడుతున్నాయి. మరణించిన అరుణగారిని తిరిగి ఈ కావ్యం ద్వారా జీవింపజేసిన ఆచార్య గోపిగారికి వినయంగా నా నమస్కారాలు. ●

నేటి నిజం
సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 గురువారం 9-4-2026

# సమాజ చైతన్యానికి ప్రేరణలు... జ్వాలాముఖి రచనలు



(ఏప్రిల్ 12 జ్వాలాముఖి జయంతి సందర్భంగా...)

జ్వాలాముఖిగా చిర పరిచితులైన వీరవెల్లి రాఘవా చార్య తెలుగు సాహిత్యంలో విప్లవాత్మక రచనల ద్వారా ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన కవి, రచయిత, మేధావి. ఆయన కేవలం సాహిత్య రంగంలోనే కాకుండా, సామాజిక చైతన్యం లో కూడా తనదైన ముద్రవేశారు. సమాజంలోని అన్యాయాలను, అసమానతలను ఎండగట్టే రచనలతో, మానవతా విలువ లను ప్రతిబింబిస్తూ జ్వాలాముఖి తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచారు.

జ్వాలాముఖి 1938 ఏప్రిల్ 12నమెదక్ జిల్లా ఆకారం గ్రామంలో జన్మించారు.

న్యాయశాస్త్ర విద్యను అభ్యసించినప్పటికీ, ఆయన జీవితాన్ని సాహిత్యానికి అంకితం చేశారు. తొలుత నాస్తికవాదాన్ని స్వీకరిం చారు. అనంతరం మార్క్సిజం, మానవతావాదం వంటి విప్లవ భావజాలాలను తమ రచనల ద్వారా ప్రచారం చేశారు. విరసం (విప్లవ రచయితల సంఘం) సభ్యుడిగా, భారత–చైనా మిత్రమం డలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. తెలుగు సాహితీ ప్రపంచంలో దిగంబర కవులుగా ప్రసిద్ధికెక్కిన ఆరుగురు కవుల్లో జ్వాలాముఖి ఒకరు. మరో ఐదుగురు యువ కవులు నగ్న ముని (ఎం.హెచ్. కేశవరావు), నిఖిలేశ్వర్ (యాదవ రెడ్డి), చెరబండ రాజు (బద్దం భాస్కర్ రెడ్డి), భైరవయ్య (మన్ మోహన్ సహాయ్) మరియు మహా స్వప్న (కామిశెట్టి వెంకటేశ్వర్లు). విరసం సభ్యులు కూడా.

జ్వాలాముఖి సాహిత్య ప్రయా ణం సామాజిక సమస్యలను ప్రతిబింబిస్తూ సాగింది. ఆయన రచనలు ముఖ్యంగా అన్యాయం, అసమానతలను ఎండగట్టడమే కాకుండా, మానవతా విలువలను విశ్లేషించాయి.

దిగంబర కవితా సంపుటాల ద్వారా తన విప్లవాత్మక దృక్పథాన్ని వ్యక్తం చేశారు.

మనిషి దీర్ఘకవితకు 1958లో గుంటూరు రచయితల సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ రచయిత పురస్కారం లభించింది.

జనతా కథలు...సామాజిక విప్లవాన్ని ప్రతిబింబించే కథల సంకలనం.

మార్క్సిస్టు భావజాలంతో రాసిన వ్యాసాలు సమాజంలోని ఆర్థిక, రాజకీయ అసమానతలను వెలుగులోకి తేవడంలో కీలకంగా నిలిచాయి. జ్వాలాముఖి కేవలం కవిగానే కాకుండా, విప్లవకా రుడు, నాస్తికుడిగానూ ప్రసిద్ధి. ఆయన రచనలు సామాజిక చైతన్యాన్ని పెంపొందించడంలో దశదిశలా మార్గనిర్దేశం చేశాయి. సరళమైన, కానీ గాఢమైన రచనా శైలితో పాఠకుల గుండెలను తాకారు. జ్వాలాముఖి తన రచనల ద్వారా పేదలు, శ్రామి కులు, దళితులు ఎదుర్కొంటున్న అన్యాయా లను నిర్భయంగా ఆవిష్కరించారు. మార్క్సిజం మరియు నాస్తికవాదం ప్రభావ ంతో ఆయన రచనలు సామాజిక మార్పు, ప్రజాస్వామ్య హక్కుల కోసం పాఠకులను చైతన్యవంతం చేశాయి. 1971 లో విరసం సభ్యుడిగా ఆంధ్రప్ర దేశ్ ప్రివెంటివ్ డిటెన్షన్ యాక్ట్ కింద నిఖిలేశ్వర్, చెరబండరా జులతో ముషీరాబాద్ జైల్లో యాభై రోజులు జైలు జీవితం గడిపారు. 1975 ఎమర్జెన్సీ కాలంలో కూడా 15 రోజులు జైల్లో ఉన్నారు.

జ్వాలాముఖి రచనల్లో వాస్తవికత, సామాజిక బాధ్యత స్పష్టంగా కనిపిస్తాయి. వ్యక్తిగత అనుభవాలను కంటే సమాజంలోని వివిధ వర్గాల సమస్యల్ని చర్చించడంలో ఆయన కృతనిశ్చ యంతో ఉండేవారు. బాల్యానికి రక్షణ, యవ్వనానికి క్రమశిక్షణ, వార్ధక్యానికి పరిరక్షణ కల్పించగల వ్యవస్థే సోషలిస్టు సమాజం అని నొక్కి చెప్పారు. ఝాన్సీ హేతువాద మెమోరియల్ అవార్డు, దాశరథి రంగాచార్య పురస్కారం, హిందీ లో వేమూరి ఆంజనేయ శర్మ అవార్డులను సొంతం చేసుకు న్నారు.

జ్వాలాముఖి 2008 డిసెం బర్ 14న కన్నుమూశారు. అయితే, ఆయన ఆలోచనలు, రచనలు ఇప్పటికీ మనకు మార్గదర్శకంగా నిలిచాయి. మానవతా విలువల ప్రతిబింబం అయిన ఆయన రచనలు, నాస్తిక వా దం, మార్క్సిజం వంటి దృక్పథాలతో పాటు, సామాజిక బాధ్యతను చాటిచెబుతాయి. జ్వాలాముఖి రచనలు కేవలం సాహిత్య రంగానికే కాకుండా, సమాజ చైతన్యానికి అనూహ్య ప్రేరణగా నిలిచాయి.



-రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

# ఎవరి వేళ్ల మధ్యనో?

ఒకరికి జీవితం
సంపూర్ణంగా వికసించిన పుష్పం.
రోజూ
అందాన్ని ఖర్చుపెట్టుకుంటూ
వాడి రాలిపోవడమే?.

సువాసనగా గాలిలో కలిసిపోతూ
రంగుగా కళ్లలో మిగిలిపోతూ
స్మృతిగా మనసుల్లో నిలిచిపోతూ
చివరికి
ఖాళీ కొమ్మగా మారిపోవడమే జీవితం.

మరికొందరికి జీవితం
తోకకు దారం కట్టిన
గాజు రెక్కల తుమ్మెద.

ఎగురుతున్నాం అనుకుంటారు
కానీ
ఎవరి వేళ్ల మధ్యనో
వారి ఆకాశం ముడివేసి ఉంటుంది
దారం పొడవే
వారి ప్రపంచం అవుతుంది.

దారం తెగుతుందనే ఆశతో కాదు
తెగిపోదేమో అనే ఆందోళనతోనే
ఎక్కువగా జీవిస్తున్నారు.

ఎందుకంటే
దారం తెగితే
ఒక క్షణమే స్వేచ్ఛ
తర్వాత
తెలియనితనం.

దారం తెగకపోతే
జీవితం అంతా
పరిమిత ఆకాశంలోనే
ఎగిరినట్టు నటించాలి.

ఒక పుష్పం
వాడిపడేలోపే
ఒక తుమ్మెద
దారం పొడవంత ఆకాశంలోకి ఎగిరింది.

సాయంత్రానికి
పుష్పం నేలపై పడింది
తుమ్మెద ఇంకా
గాల్లో తిప్పలు పడుతూనే ఉంది.


పూవు
దానిపై వాలాలనుకొనే తుమ్మెద
రెండూ జీవితాలే.




-మువ్వా శ్రీనివాసరావు
సెల్: 9948099900

పుస్తక సమీక్షలు

# స్ఫూర్తివంతమైన 'పొద్దుపొడుపు సూరీడు' కవిత్వం..




ప్రతులకు:
యెనిశెట్టి గంగా ప్రసాద్
9866447234



యెనిశెట్టి గంగాప్రసాద్ గారి **పొద్దుపొడుపు సూరీడు** కవితా సంపుటి ఆధునిక తెలుగు కవిత్వంలో ప్రజా జీవన సత్యాలను ప్రతిబింబించే విలువైన రచన. ఈ సంపుటిలోని ప్రతి గేయం జీవన సౌందర్యం, సామాజిక చైతన్యం, మానవతా స్పృహతో నిండినది. ముఖ్యంగా "తొలిపండుగ" గేయం రైతు జీవనంలోని ఆనందాన్ని, శ్రమ పట్ల గౌరవాన్ని, భూమితో ఉన్న అతని ఆత్మీయ అనుబంధాన్ని హృదయానికి హత్తుకునే రీతిలో వ్యక్తం చేస్తుంది. "పండిన పంటకు ధరలు వచ్చిన నాడే తొలి పండుగ" అనే పాదం ద్వారా కవి పండుగ అనేది కేవలం ఆచార సంబంధితదేగాక, శ్రమ ఫలితంగా వచ్చే సంతోషమని చెబుతాడు. మొలకెత్తిన మొక్కలను "వెలుగు చిరునవ్వులుగా" చిత్రించడం ద్వారా కవి ప్రకృతి ప్రేమను, రైతు మనసును మమకారంతో కలిపాడు. ఈ గేయం పల్లె జీవన సుగంధాన్ని, భూమి వాసనను ప్రతిబింబించే గేయాత్మక చిత్రపటంలా నిలుస్తుంది.

మరొక గేయం "మహిళా మహిళా" గేయం స్త్రీ శక్తి, ఆత్మవిశ్వాసం, సామాజిక చైతన్యం వంటి విలువలను ప్రతిఫలిస్తుంది. "మహిళా మహిళా నువ్వు మాన్యురాలవమ్మా" అనే పాదం స్త్రీకి ఉత్సాహాన్నిచ్చే పిలుపు. విద్య, చట్టసభ, సాంకేతిక రంగాలు వంటి అన్ని రంగాలలో స్త్రీ సమానంగా నిలబడగలదని కవి నమ్మకంగా చెబుతాడు. "ఉండగలిగినప్పుడే న్యాయం నీవైపు ఉండు" అనే చివరి పాదం ద్వారా స్త్రీ తన హక్కులను తానే సాధించుకోవాలనే స్ఫూర్తిదాయక సందేశాన్ని కవి ఇస్తాడు. ఈ రెండు గేయాలు భిన్న అంశాలపై దృష్టి సారించినప్పటికీ, రెండింటిలోనూ ఒకే భావన ఉంది ం మానవ జీవితానికి గౌరవం, శ్రమకు విలువ, స్వీయ శక్తిపై నమ్మకం. గంగాప్రసాద్ గారి భాష సరళం గా, భావం లోతుగా, లయ మధురంగా ఉంటుంది. ఆయన కవిత్వం పల్లె జీవితం, స్త్రీ జీవితం, మానవతా విలువలను కలిపి సమాజానికి స్ఫూర్తినిచ్చేలా ఉంటుంది.

'కాలం చెల్లని కథనం'' (లాక్డౌన్ కాలపు కవిత) కాలం చెల్లని కథనంతో కవిత లాక్డౌన్ సమయపు మానవ అనుభవాలను ప్రతిబింబించే సామాజిక వాస్తవ కవిత. కోవిడ్ మహమ్మారి వల్ల ఏర్పడిన నిశ్శబ్దం, భయభ్రాంతి, అలాగే మనిషి అంతరాత్మలో పుట్టిన ఆత్మపరిశీలనను ఈ కవిత సున్నితంగా ఆవిష్కరించింది. జనవాహిని ధారా లేక దారులెండిపోయినాలిలి" అనే పాదం మనిషి జీవన యాంత్రికత ఒక్కసారిగా ఆగిపోయిన స్థితిని చూపిస్తుంది. రద్దీ రహదారులు, శబ్దభరిత జీవితం క్షణాల్లో నిశ్శబ్దమైపోయిన పరిస్థితిని ఈ పంక్తి సజీవంగా చిత్రిస్తుంది. "ఆరోగ్యం, ఆనందం మన వెంటే ఉన్నవాయే" అనే పాదం ఈ కవిత యొక్క సారాంశం. మనిషి ఎప్పుడూ వెలుపల సంతోషాన్ని వెతుకడం కనిపిస్తుంది. కాని అసలు ఆరోగ్యం, ఆనందం మన లోపలే ఉన్నాయనే తాత్త్విక భావాన్ని కవి ఇక్కడ ప్రతిబింబించారు. 'ఎమర్జెన్సీ వైద్యులు వెనకడుగు వేసెను, సాధారణ రోగాలు చతికిల పడిపోయెనో" అనే పంక్తుల్లో కవి సమాజంలో చోటుచేసుకున్న వైద్య పరిస్థితులను వ్యంగ్యంగా, కానీ బాధతో వ్యక్తం చేశాడు. మహమ్మారి భయంతో వైద్య సేవల వ్యవస్థ ఎలా స్తంభించిందో ఈ కవిత సూటిగా చూపిస్తుంది.

యెనిశెట్టి గంగాప్రసాద్ గారి కవితా ప్రపంచం సామాజిక స్పృహ, మానవతా దృక్పథం, రాజకీయ అవగాహన, నైతిక విలువల సమ్మేళనం. ముఖ్యంగా **"వందనం మహాత్మా", "మత్తులో చిత్తూ", "మార్గదర్శనం", "రాజకీయ విలువలు", "జనం గుప్పిట", "వనవిహారం", "ఓటు", "నోటా"** వంటి కవితల ద్వారా సమాజంలోని వివిధ పార్శ్వాలను ఆవిష్కరించారు. **"వందనం మహాత్మా"**లో గాంధీయ ఆలోచనల గౌరవం, "మత్తులో చిత్తూ"లో విలువల పతనం, "మార్గ దర్శనం"లో నైతిక దిశానిర్దేశం, "రాజకీయ విలువలు"లో సమాజంలోని నీతిహీనతపై ప్రశ్న, "జనం గుప్పిట"లో ప్రజాశక్తి స్ఫురణ, "వనవిహారం"లో ప్రకృతిపట్ల మమకారం, "ఓటు", "నోటా"లో ప్రజాస్వామ్య చైతన్యం స్పష్టంగా వ్యక్తమవుతాయి. ఈ కవితలన్నీ సమాజానికి దర్పణంలా నిలుస్తూ, ప్రజల్లో ఆలోచన, అవగాహన, మార్పు అనే త్రివిధ శక్తులను మేల్కొలిపే ప్రయత్నం చేస్తాయి. గంగాప్రసాద్ కవితలు భాషలో సరళమైనా, భావంలో లోతైనవి. అవి మనిషిని మేల్కొలిపే, సమాజాన్ని మెరుగుపరచే స్ఫూర్తిదాయక సాహిత్యంగా నిలుస్తాయి. చక్కని స్ఫూర్తిదాయకమైన కవిత్వం రచించిన ఈ కవికి అభినందనలు..



-శైలజామిత్ర
9290900879

# తుపాల్ ... తుపాల్

(కథ)

బయట వెయిటింగ్ రూమ్‌లో ఎక్కువ పేషెంట్లు ఉన్నట్లుగా లేదు..

అప్పటికే రాత్రి పదవుతుంది.. డా. విజయ్ తన రివాల్వింగ్ చెయిర్‌లో కూర్చుని ఉన్నాడు. కాస్త అలసటగా ఉంది. సాయంత్రం ఆరు గంటల నుండి రెగ్యులర్‌గా పేషెంట్లను చూస్తూనే ఉన్నాడు. వైద్యం అనేది ఆయనకు ఒక వృత్తి కాదు. సేవ..! ఆయన వర్లీ ప్రాంతంలో పేరున్న జనరల్ ఫిజిషియన్.. సర్జన్ కూడా..!

ప్రభుత్వాసుపత్రిలో సూపరింటెండ్‌గా చేస్తూ, అక్కడి రెడ్ టేపిజమ్ నచ్చక ఉద్యోగం వదిలేసి సొంతంగా ప్రాక్టీస్ మొదలుపెట్టాడు.

అప్పటికే పది సంవత్సరాలు కావొస్తుంది. పేరున్న డాక్టరే అయినప్పటికీ ఆయన ఫీజు సామాన్యులకు అందుబాటులో ఉంటుంది గనుక పేషెంట్లతో ఆయన క్లినిక్ ఎప్పుడూ నిండుగా ఉంటుంది. డా. విజయ్ ట్రీట్‌మెంట్ పట్ల అక్కడి

జనాలకు నమ్మకం ఎక్కువ. రోగుల్లో ఆత్మవిశ్వాసం పెంచే ఆయన మాటలు, ఆయనిచ్చే భరోసా రోగులకు ఊరట కలిగిస్తుంది. అందుకే చిన్నా పెద్ద రోగాల చికిత్స కోసం పేషెంట్లు క్యూ కడుతుంటారు.

ఎదురుగా ఉన్న మోనిటర్‌ని తదేకంగా చూస్తున్న డా.విజయ్ నొసలు చిట్లించాడు. వెయిటింగ్ హాల్‌లో కూర్చున్న ఒక యువతీ,

యువకుల్ని స్క్రీన్ పై చూసి డా.విజయ్ ఆలోచనల్లో పడ్డాడు. ఇంతకు ముందు రెండు సార్లు వాళ్ళిద్దరు తన వద్దకు వచ్చినట్టు గుర్తొచ్చింది.

రెండు నెలల క్రితం మొదటిసారి వచ్చారు.

'మా అక్కయ్యకు గత రెండు రోజులుగా కడుపులో నొప్పి వస్తోంది డాక్టర్..!' అన్నాడు ఆ యువకుడు డా.విజయ్‌నే పరీక్షగా చూస్తూ.. ఆ అమ్మాయి కూడా డాక్టర్ వైపు కన్నార్పకుండా చూస్తోంది. స్టెతస్కోప్‌తో ఆ అమ్మాయిని పరీక్షిస్తున్న డా.విజయ్ ఆ అమ్మాయి

తన వైపు దీక్షగా చూస్తుండడం గమనించాడు. ఆ ఇద్దరి చూపులు డాక్టర్ విజయ్‌కు కాస్త వింతగా అనిపించాయి. క్యాబిన్‌లో ఉన్నంత సేపు,

మందులు రాస్తున్నంత సేపు వాళ్ళిద్దరూ డాక్టర్ వైపే చూశారు. ఫీజిచ్చి వెళ్తున్నప్పుడు కూడా ఆ ఇద్దరు డాక్టర్‌నే చూడసాగారు.. ప్రిస్క్రిప్షన్

రాస్తున్నప్పుడు ఆ అమ్మాయి పేరు వనజ అని, ఆ అబ్బాయి వినయ్ అని డాక్టర్‌కు తెలిసింది.

నెల రోజుల క్రితం మరొకసారి వచ్చారిద్దరూ..

ఈ సారి వినయ్‌కు గుండెలో దడగా ఉంటుందనీ, ఒళ్ళంతా చెమటలొస్తున్నాయనీ చెప్పారు. డా.విజయ్ వినయ్‌ను

పరీక్షించినప్పుడు అలాంటి లక్షణాలేవీ కనిపించలేదు. హార్ట్‌బీట్, పల్స్ రేట్ అన్నీ సరిగ్గానే ఉన్నాయి. బ్లడ్‌ప్రెషర్ కూడా నార్మల్‌గానే ఉంది.

'అన్నీ నార్మల్‌గానే ఉన్నాయి. మరి.. నీకు ఎందుకలా అనిపిస్తోంది..? ఏవైనా కానివి తిన్నావా..?' అడిగాడు డా.విజయ్.

'లేదు డాక్టర్..! ఇంటి వంటనే తిన్నాను. మాకు బయట తినడం అలవాటు లేదు.. వారం క్రితం ఇట్లాగే అయింది. మళ్ళీ రెండు

రోజుల క్రితం అవే సింప్టమ్స్ కనిపించాయి..' అన్నాడు వినయ్. వనజ కూడా అదే అంది.

'యూ నో డాక్టర్..! బయటి తిండి విషయంలో మా అమ్మ చాలా స్ట్రిక్ట్.. మా అమ్మ టీచర్‌గా రిటైర్ అయింది..' అన్నాడు వినయ్.

డాక్టర్‌కు ఆశ్చర్యమేసింది. వాళ్ళ అమ్మ గురించి తను అడగలేదే..! అయినా ఎందుకు చెబుతున్నారు. మరో విషయం ఏంటంటే

వాళ్ళిద్దరూ ఏదో మాట్లాడుతున్నప్పటికీ చూపులు మాత్రం డాక్టర్ విజయ్ పైనే పెట్టి మాట్లాడుతున్నారు. అందువల్ల డాక్టర్ విజయ్

ఇబ్బందిగా కదలసాగాడు. అయినా వాళ్ళిద్దరూ అదేం పట్టించుకోవడం లేదు. మాట్లాడుతూనే ఉన్నారు..

మందులు రాసి ఇచ్చిన తర్వాత... ఫీజు ఇచ్చిన తర్వాత కూడా వాళ్ళు బయటకు వెళ్ళకుండా డా. విజయ్‌నే చూస్తూ ఏదేదో

మాట్లాడేస్తున్నారు. డాక్టర్ విజయ్ కు ఇప్పుడు వాళ్ళ చూపులు గుచ్చుకోవడం మొదలెట్టాయి. ఎందుకలా చూస్తున్నారు..? వాళ్ళు ఏదో చెప్పాలనుకుని చెప్పకుండా ఏదేదో మాట్లాడుతూ దాటవేస్తున్నారా..? వాళ్ళ వాలకం చూస్తుంటే ట్రీట్‌మెంట్ కోసం వచ్చినట్లు గాకుండా,

పిచ్చాపాటి మాట్లాడుతూ, ఎక్కువ సమయం గడిపాలనుకుంటున్నట్లుగా ఉంది..

చివరికి తనే కల్పించుకుని..

'బయట ఇంకా పేషెంట్లు ఉన్నారు.. మీరు ఈ మందులు వాడండి.. ఏమైనా ఇబ్బంది ఉంటే మళ్ళీ కలవండి..' అన్నాడు డాక్టర్ విజయ్ 'ఇక వెళ్ళండి' అన్నట్లుగా..

'ఓ సారీ డాక్టర్..! మీతో మాట్లాడుతూ ఉంటే సమయమే తెలిసి రాలేదు..' అంటూ బయటకు వెళ్ళారు. వెళుతూ వెళుతూ వాళ్ళిద్దరు చూసిన చూపులు డా. విజయ్‌ను ఇరకాటంలో పెట్టాయి..

×××

వైద్య చికిత్సా రంగంలో డాక్టర్‌లకు కొన్ని వింత వింత అనుభవాలు కలుగుతుంటాయి. ఆ విషయం డాక్టర్ విజయ్‌కు కూడా బాగా తెలుసు. తన సుదీర్ఘమైన అనుభవంలో ఎన్నో చిత్రవిచిత్రమైన అనుభవాలు చూశాడు.

ఒకసారి ఒక వృద్ధుడు తన భార్యను తీసుకుని వచ్చాడు. ఆయనకు సుమారు డెబ్బయి అయిదు సంవత్సరాలు ఉండొచ్చు. ఆయన

భార్యకు డెబ్బై ఏండ్లుంటాయి. దాదాపుగా ఇద్దరూ నడుం వొంగిపోయి ఉన్నారు. శరీరం ముడతలు పడి వొదులు వొదులుగా అక్కడక్కడా

వేలాడుతోంది. ఇద్దరికీ పళ్ళు రాలిపోయాయి.

'డాక్టర్ సాబ్..! మా ఆవిడ నన్ను చాలా ఇబ్బంది పెడుతోంది.. నన్ను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు...' అన్నాడు ఆ వృద్ధుడు.

'ఈ విషయంలో నేనేమీ చేయగలను..? మీ కుల పెద్దలకు చెప్పుకుని లేదా మీ కొడుకులకు బిడ్డలకు చెప్పుకొని

పరిష్కరించుకొండి.. నేను డాక్టర్‌ని.. మందులు ఇవ్వగలను కానీ, పంచాయితీలు చెప్పలేను కదా..?' అన్నాడు డాక్టర్ విజయ్ కాస్త చిరాకుగా..

'లేదు డాక్టర్..! మీరే ఈ సమస్యను పరిష్కరించగలరు..' దృఢంగా అన్నాడా వృద్ధుడు.

'చెబితే అర్థం చేసుకోరెందుకు..? ఇది మీ ఇంటి విషయం.. డాక్టర్లకు సంబంధించింది కాదు..' అన్నాడు డాక్టర్ విజయ్.

'నేను అదే చెబుతున్నానయ్యా...! ఈ ముసలోడికి మతి తప్పింది. వద్ద

**జనాలకు నమ్మకం ఎక్కువ. రోగుల్లో ఆత్మవిశ్వాసం పెంచే ఆయన మాటలు, ఆయనిచ్చే భరోసా రోగులకు ఊరట కలిగిస్తుంది. అందుకే చిన్నా పెద్ద రోగాల చికిత్స కోసం పేషెంట్లు క్యూ కడుతుంటారు.**

వద్దన్నప్పటికీ నన్నిక్కడికి బలవంతంగా తీసుకొచ్చాడు..

మీరేం అనుకోవద్దు డాక్టర్..' అంది ఆ ముసలావిడ వినయంగా..

'నువ్వు నోర్ముయ్..! నీ సంగతి నాకు బాగా తెలుసు.. నీ వెధవ వేషాలు బయటపడతాయనీ నాటకాలు చేస్తున్నవ్..' అన్నాడు

వృద్ధుడు కోపంగా..

అప్పటికే డాక్టర్ విజయ్‌లో సహనం నశించింది. 'ఇదేం గోలరా' అని తలపట్టుకున్నాడు.. కానీ, అరవనూ లేదు.. వాళ్ళ సమస్య ఏమిటో అర్థం కావడమూ లేదు..

'సరే..! ఇంతకు సమస్య ఏమిటో చెప్పండి.. వింటాను..' అన్నాడు తెచ్చిపెట్టుకున్న సహనంతో...

'డాక్టర్ సాబ్..! ఈ ముసల్ది నన్ను ఇంట్లో పూచికపుల్లలా చూస్తోంది. ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.. మీకో విషయం

చెప్పాలి..' అంటూ డాక్టర్ విజయ్‌కి దగ్గరగా జరిగి చెవిలో చెప్పినట్టుగా చెప్పసాగాడు.

'డాక్టర్ సాబ్..! మా ఇంటి ముందు ఇంట్లోకి ఒక రిటైర్డ్ మిలిటరోడు కిరాయికి వచ్చాడు. ఇది వాడిని మరిగింది. పొద్దస్తమానం

ఇది వాడితో ఇకఇకలు పకపకలు.. చూడలేకపోతున్నా.. ఇది వాడితో కులుకుతుంది.. దీని ఒంట్లో కావురం తగ్గేందుకు ఏదైనా మందివ్వండి.. లేకుంటే ఇది వాడితో లేచిపోయి నా పరువు తీసేలా ఉంది..' అన్నాడు ఏడుపు గొంతుతో.

రెండడుగులు ఎగిరిపడ్డాడు డాక్టర్ విజయ్..!

ఆయన రెండు కళ్ళు ఆల్చిప్పల్లా విచ్చుకున్నాయి. కళ్ళతో పాటు నోరు కూడా

తెరుచుకుంది.. మాటపడిపోయినట్లయింది...

'ఒరేయ్ ముసలోడా..! నీకిదేం పోయే కాలంరా..! ఈ వయసులో నన్ను అనుమానిస్తావేంరా సచ్చినోడా..! నీ పేరు మాసిపోను..

నువ్వు బొందలగడ్డకు పోను.. నువ్వు నాశనం కాను..' తిట్లదండకం అందుకుంది ముసల్ది..

కొంచెం కుదుటపడ్డాడు డాక్టర్

విజయ్..

'మీరిద్దరూ రేపు సాయంత్రం రండి.. అప్పుడు మంచిగా పరీక్షలు చేసి మందులిస్తాను..' అని సముదాయించి సాగనంపాడు...



×××

డాక్టరంటే కొన్ని కొన్ని సందర్భాల్లో డాక్టర్‌గానే ఉండడు. అప్పుడప్పుడు స్నేహితుడిగా, శ్రేయోభిలాషిగా, వక్తగా, శ్రోతగా,

ప్రేక్షకుడిగా మారిపోవాల్సి ఉంటుంది. కొందరు పేషెంట్లు దబాయిస్తారు. కొందరు పేషెంట్లు బెదిరిస్తారు.. మరికొందరేమో క్లినిక్‌లోనే

శోకాలు లంఘిస్తారు..

ఓసారి మధ్య వయసులో ఉన్న ఓ భార్యాభర్తలు వచ్చారు. ఇద్దరూ అందంగానే ఉన్నారు. ఆయన శారీరకంగా దృఢంగా, ఆమె

నిండుగా ఉంది.

'డాక్టర్ సాబ్..! మీరే ఎట్లాగైనా కాపాడాలి..' అన్నాడు భర్త.

'చెప్పండి..! ప్రాబ్లెమ్ ఎవరికీ..? మీకా..? మీ భార్యకా..?' అడిగాడు డాక్టర్ విజయ్..

'నాకేం ప్రాబ్లెమ్ లేదు డాక్టర్..! ఈయనకే.. కొత్తకొత్త రోగాలొస్తున్నాయి.' అంది ఆవిడ నిష్ఠూరంగా..

'నువ్వు మూసుకో..! డాక్టర్ సాబ్..! నేనేం చేసినా కుటుంబం కోసమే.. ఈ విషయం దీనికి అర్థం కావడం లేదు..' అన్నాడాయన

కోపంగా..

'మీరిద్దరూ ఆగండి..! ఇంతకీ మీ సమస్య ఏమిటి..? ఎవరికీ..? ముందు అది చెప్పండి.. మీ ఇంటి లొల్లి ఇక్కడ వద్దంటే వద్దు..'

అన్నాడు అసహనంగా డాక్టర్ విజయ్..

'డాక్టర్ సాబ్..! దీనికే ట్రీట్‌మెంట్ ఇవ్వండి..! దీనికి బుద్ధి భద్రంగా ఉండడం లేదు..' అన్నాడాయన..

'నాక్కాదు.. నీకే .. నీ బుద్దే గడ్డితింటోంది..' గుర్రుగా చూస్తూ అరిచింది ఆవిడ.

'మీరు నా వద్దకు ట్రీట్‌మెంట్‌కు వచ్చారా లేక గొడవపడడానికి వచ్చారా..? ఒకవేళ గొడవ పడాలనుకుంటే బయటకు వెళ్ళండి..'

అన్నాడు డాక్టర్ విజయ్..

'డాక్టర్ సాబ్..! నేను చెబుతా వినండి.. నేనొక చిరు ఉద్యోగిని. బొటాబొటి సంపాదనతో ఇల్లు గడవడం కష్టంగా ఉంటోంది. కిందా మీదపడి గడుపుకొస్తున్నాం.. దీనకేమో కోపమెక్కువ.. ఏదీ అర్థం చేసుకోదు.. దీని కోపం తగ్గి, సహనం పెరిగే మందులివ్వండి..'

అన్నాడు ఆయన.

ఆమెను పరీక్షించాడు డాక్టర్.. బ్లడ్ ప్రెషర్ నార్మల్‌గానే ఉంది.

'బీపీ బాగానే ఉందే..! మరి కోపమెందుకు ఎక్కువగా వస్తోంది..?' సాలోచనగా గొణుక్కున్నాడు డాక్టర్ విజయ్..

'అవునూ..! ఇంతకీ, ఎప్పుడు, ఏ సందర్భంలో ఈవిడకు కోపం వస్తుంది. అది చెప్పండి ముందు..' పైకే అనేశాడు..

'డాక్టర్ సాబ్..! చెప్పాను కదా.! మా ఆర్థిక పరిస్థితి బాగాలేదని.. ఇట్లాంటి వేళ కొంత కాలం క్రితం మా ఆఫీసులో ఒక విడో తో

నాకు పరిచయం అయింది.. ఆమెకు 'తన' అనే వారెవరూ లేరు. ఆమెతో నేను లివింగ్ రిలేషన్‌లో ఉన్నాను. ఆమెను నేను చేసుకుంటే ఆమె పేరు మీద ఉన్న ఫ్లాటు, ప్లాటూ రెండూ మాకు కలిసొస్తాయి.. పైగా

ఉద్యోగం చేస్తోంది.. నెల నెలా జీతం వస్తుంది. మా కుటుంబం ఆర్థికంగా

ఎదగవచ్చు.. ఇదే విషయం దీంతో అంటే ఎగిరెగిరిపడుతోంది.. పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తోంది. మీరు ఏవైనా మందులిచ్చి దీన్ని శాంతంగా

ఉండేలా చేయండి ప్లీజ్... డాక్టర్.. ప్లీజ్..!' వేడుకున్నట్టుగా అన్నాడా వ్యక్తి.

నివ్వెరపోయాడు డాక్టర్ విజయ్..

ఆయన పూర్తిగా నివ్వెరపోకముందే ఆవిడ గయ్‌మని లేచింది.

'అదిగో మళ్ళీ అదే పాట..! నీ నాలుక చీరేస్తాను.. నీ పుర్రె పగలకొడతాను.. దాని పేరెత్తితే నీ ముఖం బద్దలు చేస్తాను..' కోపంతో

ఊగిపోసాగింది. డాక్టర్ కంగారుగా సిసి కెమెరాల స్క్రీన్ వైపు చూశాడు.. లోపలి గదిలో నుండి వినబడ్డ ఈ కేకలకి వెయిటింగ్ రూమ్ లో ఉన్న ఇద్దరు ముగ్గురు

పేషెంట్లు కంగారుగా లేచి బయటకు పరుగుపరుగున వెళ్ళిపోవడం డాక్టర్ విజయ్ కంటపడింది

'ఒక పని చేయండి..! ఇది సీరియస్ రోగం కనుక వచ్చే ఆదివారం ఆ విడోను తీసుకొని మీరిద్దరూ పోలీస్ స్టేషన్‌కు రండి..నేనూ

అక్కడికే వస్తాను.. పోలీసుల ముందే నేను ట్రీట్‌మెంట్ ఇస్తాను.. ఇది ఒక్కరికి ఇచ్చే ట్రీట్‌మెంట్ కాదు.. ముగ్గురికీ ఇవ్వాలి..' అని సర్ది చెప్పి

పంపించాడు..

×××

స్క్రీన్ మీదే చూపులు నిలిపాడు డాక్టర్ విజయ్..

పేషెంట్స్ ఎవరూ లేరు. ఆ ఇద్దరు యువతీ యువకులు తప్ప..! డాక్టర్ విజయ్‌కు దడ పుట్టింది. వీళ్ళిద్దరు అసలెందుకు వచ్చారు..?

ట్రీట్‌మెంట్ కోసమైతే రాలేదు.. మరి ఎందుకు వచ్చినట్టు..? పైగా ఆ చూపు లేంటి..? తినేసేలా..? కొంపదీసి ఏదైనా స్కామ్‌కు స్కెచ్ వేస్తున్నారా..? ఈ రోజుల్లో ఎవ్వర్నీ నమ్మే పరిస్థితి లేదు.

వాళ్లిద్దర్ని లోపలికి పిలవడమా లేక ఏదో ఒక వంక చెప్పి తిరిగి పంపించాలా..? తోచడం లేదు డాక్టర్ విజయ్‌కి.. స్క్రీన్ పై పరీక్షగా

చూశాడు. ఆ యువకుడి చేతిలో చతురస్రాకారంలో ఏదో వస్తువు ఉంది. ఏమిటది..? ఏదైనా కొత్త రకం ఆయుధమా..? ట్రీట్‌మెంట్‌కు వచ్చే

వ్యక్తులు డాక్టర్ వద్దకు రిపోర్టులతో రావాలి కానీ వస్తువులతో ఎందుకు వస్తారు..?

మొదటిసారి కడుపు నొప్పి అన్నారు.. రెండోసారి మరేదో అన్నారు.. నిజానికి ఆ రెండు సార్లు ఊరికే ఫీజులిచ్చిపోయారు తప్ప

వారిలో రోగలక్షణాలేవి కనిపించలేదు.. మళ్ళీ ఈ రోజు వచ్చారు.. ఏమిటి అసలు కథ..?

డాక్టర్ విజయ్ ఆలోచనలో పడ్డాడు..

'డాక్టర్..! చివరి పేషెంట్స్ మిగిలారు.. పంపించమంటారా..?' ఇంటర్‌కామ్‌లో అడిగింది రిసెప్షనిస్ట్..

'ఆ.. సరే..! పంపించు..' పొడిపొడిగా అన్నాడు డాక్టర్ విజయ్.. వాళ్లిద్దరూ స్ప్రింగ్ డోర్ తీసుకొని లోపలికి ఎంటరయ్యారు.

'నమస్తే డాక్టర్..!' అన్నారు ఇద్దరూ ఒకేసారి..

'నమస్తే.. నమస్తే..' తడబడుతూ అన్నాడు డాక్టర్ విజయ్.. వాళ్లిద్దరూ డాక్టర్ విజయ్‌ను కొరికేసేలా చూస్తున్నారు. ఆ చూపులు కంపరంగా ఉన్నాయి డాక్టర్‌కి.. తమాయించుకొని అడిగాడు..

'చెప్పండి..! మీ ఇద్దరిలో సమస్య ఎవరికుంది..?'

'అదీ.. అదీ..' నసగసాగారు ఇద్దరూ..

ముందు వాళ్ళిద్దరూ ఒకర్నొకరు చూసుకున్నారు. మళ్ళీ డాక్టర్‌ను చూడసాగారు..

'అర్థమైంది.. నిజానికి మీకే సమస్య లేదు.. పనిగట్టుకొని నా వద్దకు వస్తున్నారు. గతంలో కూడా మీకే సమస్య లేకున్నా ఏదో ఒకటి

చెప్పి నా వద్దకు వచ్చారు.. ఇప్పుడు మళ్ళీ వచ్చారు.. అసలేం కావాలి మీకు..? మీరెవరు..? నా నుండి ఏం కోరుకుం

**వైద్య చికిత్సా రంగంలో డాక్టర్‌లకు కొన్ని వింత వింత అనుభవాలు కలుగుతుంటాయి. ఆ విషయం డాక్టర్ విజయ్‌కు కూడా బాగా తెలుసు. తన సుదీర్ఘమైన అనుభవంలో ఎన్నో చిత్రవిచిత్రమైన అనుభవాలు చూశాడు.**

టున్నారు..? చెప్పండి..'

గద్దించినట్టుగా అడిగాడు డాక్టర్ విజయ్.

వాళ్ళిద్దరూ ఖంగుతిన్నారు. డాక్టర్ ఇంత స్పీడ్‌గా రియాక్ట్ అవుతాడని వాళ్ళు ఊహించలేదు..

'ఏమిటీ మౌనం..? ఎవరైన మీకు సుపారి ఇచ్చి నా వద్దకు పంపించారా..? ప్రొఫెషనల్ రైవల్రీతో ఎవరైనా కక్ష తీర్చుకునేందుకు మీ

ఇద్దర్ని నియమించారా..? ఏమిటీ సంగతి..? పోలీసుల్ని పిలవమంటారా..?'

'అయ్యో.. అయ్యో..! అలాంటిదేం లేదండి డాక్టర్ గారూ..! పోలీసులెందుకు..? మేం అలాంటి వాళ్ళం కాదు..' అన్నారిద్దరూ

కూడబలుక్కున్నట్టుగా..

'మరేం కావాలి మీకు..?'

'మాకేం వద్దండీ..!' అంటూ చేతిలో ఉన్న ఆ వస్తువుని డాక్టర్ చేతిలో పెట్టారు. దాని వైపు అనుమానంగా చూస్తూ ఆ వస్తువుపై

చుట్టిన పేపర్స్‌ను తొలిగించాడు డాక్టర్ విజయ్. అదొక ఫోటో ఫ్రేమ్.. దాన్ని తన వైపు తిప్పి చూశాడు.

ఆయన కళ్ళు ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి..

ఆ ఫోటో తనదే..! అచ్చు గుద్దినట్లు తన లాగే ఉంది.. తనలాగా ఉండడం ఏమిటి..?

తనే..!! కాకుంటే తనకు తల నిండా జుత్తుంది. ఆ ఫోటోకి లేదు.. అంతే తేడా..! మిగతా అంతా సేమ్ టు సేమ్..!

'ఎవరిదీ ఫోటో..? అచ్చం నాలాగే ఉంది.. కానీ, ఇది నాది మాత్రం కాదు..' తెల్లబోతు అన్నాడు డాక్టర్ విజయ్..!

'అదే కదా సార్..! మేం తరచు మీ వద్దకు రావడానికి అసలు కారణం..' అన్నాడా యువకుడు వినయ్..

'అదే ఏది..? ఏం కారణం..? ఆ ఫోటోలో ఉన్న వ్యక్తి ఎవరు..? దాంతో నాకేం సంబంధం..?' డాక్టర్ విజయ్ గొంతులో

విస్మయం తొంగి చూసింది..

'డాక్టర్ సాబ్..! ఈయన మా నాన్నగారు.. కుంభమేళాకు వెళ్ళి తిరిగిరాలేదు. మా నాన్న కోసం ఎదిరి చూసి చూసీ మా అమ్మ మంచాన పడింది. ఎందరో డాక్టర్లకు చూపించాం.. కానీ ఫలితం లేదు. మంచం పైనే పడిఉంటోంది. మూణ్ణెళ్ళ క్రితం డాక్టర్స్

అసోసియేషన్ వాళ్ళు నిర్వహించిన కాన్ఫరెన్స్‌కు మీరు చీఫ్ గెస్ట్‌గా వచ్చిన ఫోటోలు మేం పేపర్లలో చూశాం. మీరు అచ్చం మా

నాన్నగారిలా ఉండడం మాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. మీరే మా నాన్నగారేమోననే అనుమానం మాక్కలిగింది.. ఇక్కడ యాదృచ్ఛికం

ఏంటంటే మా నాన్నగారు కూడా డాక్టరే కావడం..!'

'నేను మీ నాన్ననైతే తప్పించుకు ఎందుకు తిరుగుతాను..? నాకూ ఓ కుటుంబం ఉంది. పిల్లలున్నారు.. నేను మీ నాన్నగారు కావటం ఏమిటి పిచ్చిగాక పోతే..?'

'మా నాన్నగారికి కాస్త గోడలు దూకే తత్వం ఉంది లెండి..! ఇది మంచి పద్ధతి కాదని మా అమ్మ, మేమూ చెప్పీ చెప్పీ

అలసిపోయాం.. ఆయనే కుంభమేళా పేరుతో తప్పించుకొని పోయి కొత్త సంసారం ఏమైనా పెట్టారేమోననీ, మీరే ఆయన కావొచ్చని

అనుమానంతో అసలు విషయం తేల్చుకునేందుకు మీ దగ్గరకు రాసాగాం.. ఈ మూణ్ణెళ్లలో వేం మీ మొత్తం చరిత్రనంతా వెలికి తీశాం. మీరు మా నాన్న కాదని మీకు చెప్పి, మా నాన్న ఫోటో చూపించి, మేం చేసిందానికి క్షమాపణ చెబుతామని ఈ రోజు వచ్చాం డాక్టర్..'

అన్నాడు వినయ్..

'వాట్ నాన్సెన్స్..! అంటే మీరు నా పై నిఘా పెట్టారన్నమాట..ఆ హక్కు మీకెవరిచ్చారు..? ఒక సభ్యసమాజానికి చెందిన వైద్యుడి గురించి వాకబు చేయడం కరెక్టేనా..? మీకసలు పోల్చుకోవడం రాదా..? మీ నాన్న ముఖం నాలాగా ఉండొచ్చు కానీ, జుత్తులేని గుండాయనకు నాకూ పోలికేమిటి..? ఓ గాడ్..! నాకు తెలియకుండా నా వివరాలు సేకరిస్తారా..? మీ గురించి పోలీసులకు చెబుతాను..'

మండిపడుతూ అన్నాడు డాక్టర్ విజయ్..

ఆ ఇద్దరు కిసుక్కున నవ్వారు.

'సరే చెప్పండి..! మేం మీ గురించి ఎంక్వయిరీ చేస్తున్నప్పుడు ఊర్వశి గురించి మాకు తెలిసింది.. అబ్బో..! మీ గురించి చాలా

గొప్పగా చెప్పింది. పోలీసులు వస్తే ఊర్వశి గురించి కూడా చెప్పాల్సి ఉంటుంది. అంతేగాదు..! ఎవరెవరు ఏఏ గోడలు దూకారో,

దూకుతున్నారో చెప్పాల్సి ఉంటుంది.. సరేనా..?' అడిగాడు వినయ్..

పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడ్డాడు డాక్టర్ విజయ్..

'నో.. నో.. సరికాదు..! పోలీసులు వద్దు.. ఏమీ వద్దు.. మీరెళ్ళండి.. మళ్ళీ రావొద్దు.. శ్రద్ధగా మీ నాన్నగారిని వెతుక్కొండి..

అంతా తుపాల్ తుపాల్..' చేతులు జోడించి అన్నాడు డాక్టర్ విజయ్.



- డా॥తాటి నరహరి,
సెల్:9322400551

## తనకు తానే తగలబడ్తాండు

మనిషి అంతరిక్షంలో అడుగుపెట్టినా
కడలి లోతులను కని పెట్టినా
అవనిపై అద్భుతాలను ఆరబోసినా
మనిషి మాత్రం ఒంటిమామిడి చెట్టైతాండు
ఎండిపోయిన ఏటి గట్టైతాండు.
పెదవులపై ప్లాస్టిక్ నవ్వులు
అంతరంగంలో ఆరని మంటలు
మనిషి పైకి గంభీరంగా కనిపించినా
లోపల తనకు తానే తగలబడ్తాండు
బతుకు కడలిలో చెలరేగిన అలలకు
శిరస్సు తెగిన కోడిపిల్ల లా కొట్టుకుంటాండు.
గుండె చుట్టూ ముసిరిన సమస్యలను
పది మంది ముందర పారబోయకుండా
కడుపులో పెట్టి కాల్చుకుంటాండు
పక్కోల్లు , పాలోల్లతోటి పలుకులను
పంచుకోకుండా పెదవులకు తాళం వేస్తుండు
మనిషి ఇప్పుడు "ఇగో " బంధంలో ఇరుక్కొని
బతుకు నావను ఈదుతున్నాడు



-తాటిపాముల రమేశ్
7981566031

## కలకలం.. యధాలాపం

ఎన్ని స్కామ్ లయినా
అవినీతి దందా చిట్టాలు
మీడియాలో వచ్చిన రోజే కలకలం
మరునాటి నుండి యధాలాపం
చర్యలు విచారణలు ఖాయమన్న
పాలకుల మాటలు, హెచ్చరికలు
ఏళ్ళు గడిచినా గొంగళి అక్కడే
సామాన్యులపై నే కఠినం
పెద్దలకు మాఫీ పెద్దరికంతో



-పత్తి శివ ప్రసాద్
9440001224

## తన్మయుల్ని చేసిన పౌరాణిక పద్యనాటకములు



ప్రపంచ రంగస్థల దినోత్సవం, శ్రీరామనవమిలను పురస్కరించుకుని మార్చి 27వ తేదీన తెలంగాణప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, అలకాపురి సాయిమందిరం సౌజన్యంతో శ్రీ చోడేశ్వర నాట్యకళామండలి సమర్పణలో అద్భుతంగా ప్రదర్శింపబడిన శ్రీరామాంజనేయ యుద్ధం, శ్రీకృష్ణరా యబారము పౌరాణిక పద్యనాటకాలు విచ్చేసిన అశేష ప్రేక్షకులను తన్మయుల్ని చేసి ఆధ్యాత్మికమార్గంలో పయనింపజేశాయి. తాండ్రసుబ్రహ్మణ్యం రచించిన శ్రీరామాంజనేయ యుద్ధం పద్య పౌరాణిక నాటకంలో శ్రీరాముడుగా బి. నారాయణ స్వామి, ఆంజనేయుడుగా ఎస్.వెంకటేశ్వర్లు, నారదుడుగా ఎం.రామ్మోహన రావులు; తిరుపతి వెంకటకవుల రచనలో రూపొందిన శ్రీకృష్ణరాయబారం పద్యపౌరాణిక నాటకంలో శ్రీకృష్ణుడుగా రామాచారి, దుర్యోధనుడు నాగేశ్వరరావు, కర్ణుడు మల్లాది వెంకటరమణ, వికర్ణ సి.హెచ్.వి.ఆర్.కె.మూర్తి, విదురపాత్రలో పొత్తూరి సుబ్బారావు,ధృతరాష్ట్రుడు నర్సింగ, భీష్మ వెంకటేశ్వర్లు,ద్రోణ రామ్మోహనరావు, అశ్వద్ధామ శ్రీనివాసరావు, తమ తమ పాత్రల్లో అద్భుతంగా నటించి మెప్పించి ఆహూతుల, అతిథుల ప్రశంసలందుకున్నారు. ఈ సందర్భంగా ప్రముఖఅతిథులు పొత్తూరి గోపాలకృష్ణమూర్తి, బి.టి.ప్రసాద్, వి. వీరేంద్ర తదితరులు రెండు నాటకాలల్లోని నటీనటులను ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపారు.

## తెలియకనే, మరి అడుగుతున్న

తెలియకనే
మరి, అడుగుతున్న

మనం, మనుషులమేనా
మనం, సమూహ... సమత.. సజీవ సుందర
దేశంలోనే ఉన్నామా

వంద గొర్రెలకు
ఒక కాపరి, ఒక యజమాని, ఉన్నట్లు

మనకు, మన దేశానికి
ఇద్దరు కాపర్లు, ఇద్దరు యజమానుల

ఏమో... తెలియకనే
మరి, అడుగుతున్న
పండుగ పబ్బాలు వచ్చినట్లే
గొర్లు ఒక్కొక్కటి హత్య చేయబడి
ముక్కలు ముక్కలుగా, తూకానికి
అమ్ముకుంటున్నట్లు,

ఎన్నికల మాయ జాతర ఐ, వచ్చినట్లు
మనం కూడా, ఒక్కొక్కరు హత్య చేయబడి
కులమత ధన, మర్మగర్భ బీతికి
ముక్కలు ముక్కలుగా, తూకానికి
అమ్ముడుపోతున్నామా, బలిసాలలో
ఉంటున్నామా,
ఉన్నామా
ఏమో... తెలియకనే
మరి, అడుగుతున్న



–జన జ్వాల
9949163770

## పదహారణాల పక్కాతెలుగు

(పదారుగుణాల పక్కాతెలుగు)

అచ్చతెలుగు – అందాలమయము
అమ్మా–ఆవులశబ్దము – ఆనందభరితము
తేటతెలుగు – చిందుశ్రావ్యము
తేనెచుక్కలుచల్లు – స్థిరస్థావరము.
స్వచ్ఛతెలుగు – శ్వేతవెలుగు
స్వాతికిరణాలు– చిమ్ముసాధనము
జానుతెలుగు – బహుప్రఖ్యాతము
వీనులకువిందు – వడ్డించుమార్గము.
తీపితెలుగు తన్మాత్రము
సంతసాలుకూర్చు – సువిశాలమార్గము
మేటితెలుగు – ప్రచురణాత్మకము
మస్తకాలుమెరిపించు – మహాసాధనము.
సుందరతెలుగు – సంగీతప్రశస్త్యము
కీర్తాలాపనలు – కర్ణాలకుభాగ్యము
మంచితెలుగు – మనోహరగానము
సుమసౌరభాలు – చల్లుటక్కువు.
పల్లెతెలుగు – ప్రశంసనీయము
జానపదాలదీపం – జనచైతన్యము
పట్నతెలుగు – ప్రజలపలుకులు
ప్రచారపథాల్లో – నిత్యనూతనాలు.
వరాలతెలుగు – వాగ్దేవివరము
వాక్కులురసాత్మకము – వందనీయము
సుస్వరాలతెలుగు – ఎత్తించుగళము
సుమధురగీతాలు – అందించుపీయూషము.
బంగారుతెలుగు – మోములవెలుగు
కులుకులొలుకు – నవ్వులచందనము
రత్నాలతెలుగు – నిధులనిక్షేపము
ముత్యాలజిలుగులు – వెదజల్లువిశ్వము.
అజంతాతెలుగు – పలుప్రక్రియలప్రవాహము
ప్రచండపవనము – ప్రపంచవ్యాప్తము
మనతెలుగు – మనోరంజకము
మహిమాన్వితము – మహిలోవిశిష్టము



–గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్
సెల్: 7981616630

## చెత్త కుప్పలు – కాలుష్యపు దిబ్బలు

నగర జీవితాలిప్పుడు
దుర్భరంగ మారిపాయె !
చెత్త కుప్పలన్ని పెరిగి
గుట్టలుగా పరిణమించి
దుర్వాసన
నెలవులయ్యె!
చెత్త కుప్ప సమీపాల
సగటు మనిషి జీవితాలు
రోగగ్రస్థ నిలయమా యె!
కంపుగొట్టె దుర్వాసన
ముక్కుపుటాలదరగొట్టి
ప్రజారోగ్య శాఖ కిపుడు
పెనుసవాలు గా మారెను!
చెత్త నుండి విద్యుత్తును
చెత్త నుండి ఎరువులనూ
సంగ్రహించి చెత్త ముప్పు
తగ్గించకపోతె రేపు
ఈ కుప్పలు ప్రాణాంతక
విష వాయువు చిమ్ముకుంటు
జీవరాశి అంతు తేల్చి
మనుగడనే ప్రశ్నించును!!
తస్మాత్ జాగ్రత్త సుమా!



– డా॥దాశరథుల
నర్సయ్య
9390919100

## సిస్టర్స్... సెల్యూట్స్

సేవకు ప్రతిరూపం ఆమె
రక్తసంబంధం లేని చెల్లి ఆమె
దయాకరుణల కలబోత ఆమె
రోగుల పాలిటి దేవత ఆమె..
పాలకన్నా తెల్లనైన
వస్త్రాలను ధరియించి
సిస్టర్ అని పిలవగానే
చిరునవ్వు మోము తో
పేషంట్ ముందు నిలిచి
వ్యాధికి తగిన మందులిచ్చి
మల్లె మనసుతో సేవచేసే
సేవామూర్తులు సిస్టర్లు..
అలుపెరుగని సేవచేస్తారు
ఆత్మీయత పంచుతారు
ధైర్య వచనాలు చెపుతారు
సగం జబ్బును తగ్గిస్తారు
వైద్యాలయాల్లో సిస్టర్లు
ధన్వంతరి వారసురాల్లు
ధరణిలోన దేవతలు



–బూర దేవానందం
8143589789.

## వైడ్ యాంగిల్

భూమిని విశాల కోణంలో
చూడు
పచ్చని అడవులు
నీలి సముద్రాలు
పక్షుల విహారాలు
పువ్వుల సమ్మేళనాలు –
చెట్టు ఉరికి వేలాడుతూ
నదులు మలినం కాబడుతూ
జీవమున్న విశ్వశక్తిని
ప్రాణం లేకుండా బూడిద
చేస్తున్నాం.
కాలుష్యం సోకి
ప్రాణవాయువు తిత్తులు
దేహాల్ని రోగాల ఫ్యాక్టరీ
చేస్తున్నాయి
దేశం అనారోగ్యపు
గుడారాల శిబిరం
కాకముందే ముందుకు
సాగి
మొక్కలు నాటకపోతే
పిల్లల పచ్చని నవ్వులను
వెల చెల్లించినా వెలిగించ
లేరు !



–మండాది గోపీనాథ్
98850 45344

## పిడికిలి

కన్నీళ్లకు కూడా
అర్థం ఉందంటారు కానీ,
అర్థం కాని కన్నీళ్లు ఎన్నో.

ఒక్కొక్కసారి ఎంత
అన్వేషించినా...
కొన్ని కన్నీళ్లు అర్థం కావు.
కొన్ని మనస్సులు
అర్థం కావు.

మనసు
ప్రశాంతత చెదిరినప్పుడు
చిరుజల్లులు
నేల మీద పడినా...
తల మీద పడినా
ఒకటే.

శరీరం
స్పర్శ
కోల్పోయినప్పుడు
గాయం
శరీరం మీద ఉన్నా..
మనసు మీద ఉన్నా ...
ఒకటే.

సూర్యాస్తమయం
రక్తంతో నిండింది.

సూర్యోదయం
గాయంతో నిండింది.

నక్షత్రాలు
మెరవడం లేదు
ఆకాశాన్ని చీకటి
చుట్టుకుంది.

నక్షత్రాల గుంపు
చెల్లాచెదురు.

పర్వతాలు
ఓడి పోతున్నాయి
అరణ్యం
ఆశల
దిక్కులేని దయ్యింది.

దారులన్నీ .....కన్నీళ్లు.
ఏ దిక్కు
సూర్యోదయమో....
అర్థం కాని బాధ.

అన్ని దిక్కులూ ...
బూడిద నిండిన
నిప్పులు.

దారి ఎటు పోతుందో....
తెలియని నిరాశ.

చల్లగాలి
మాటాడడం
మానేసింది.

కొన్ని మాటలకు
అర్థం ఉందంటారు
కానీ.....
అర్థం కాని
మౌన మూగ
మనసు మాటలెన్నో.

శ్రమ సంపద
ఉరి పెట్టుకుంది
మట్టి దిగులును
నింపుకుంది
ఊపిరాడక
ఆశగా చూస్తోంది.

అరణ్యం చేతుల గాయం
ఆకాశానికై చూస్తున్నది.

కొన్ని గాయాలకు
నొప్పి ఉందంటారు
కానీ....
నొప్పి కనిపించని
గాయాలెన్నో.

దుఃఖం సాగరమయ్యింది
కన్నీళ్ల ధార పారుతున్నది.

జనం తమ కన్నీళ్ళ మీద
జీవితమంతా ....
చీకటి మోస్తున్నారు.

కన్నీళ్ళ లెక్కలేదు
బాధల లెక్కలేదు
అడుగడుగునా
జరిగే మోసాలకు
లెక్కలేదు.

డబ్బు రాజ్యమేలుతున్న
వ్యవస్థలో
శ్రమ చెమట
ఓడిపోతున్నది.

జీవితం అడుగు
తడబడుతున్నది.

రేపటి తరానికి
ఆకలే మిగులుతున్నది.

వెన్నెల
కష్టజీవి జీవితంలో
పూలు పూయించడం లేదు
చందమామ మసకబారింది.

అమావాస్య
చీకటి కమ్ముకున్న పల్లెలు

మాటల మధురిమ కింద
తేనెటీగలు కనిపిస్తున్న బాధ.

ఆనందం
కాగితం పూలయ్యాయి
నిత్య దుఃఖం
నిత్య కన్నీరు.

కాలాన్ని కన్నీటి చుక్క
కరగదీస్తున్నది.

కలలు అడుగడుగునా
ధ్వంసం అవుతున్న వేళ
ఆకాశం విషాదమైన వేళ

మేఘం చీకట్లో మెరుస్తున్నది.
కన్నీళ్ల వరద
సాగరమయ్యింది.

కొన్ని కలలకు
అర్థం ఉందంటారు
కానీ....
కన్నీళ్లను వీడక
జీవితం సాగే కలలెన్నో...

కొన్ని ఆనందాలకు
అర్థం ఉందంటారు

దుఃఖ విషాదాలను
వీడలేని జీవితాల్లో
అన్నీ ....
ఓడిపోయిన దృశ్యాలే.

కవిత్వం ఆనవాళ్లు
అక్షరాలు కాదు
మెరిసే నక్షత్రాలు.

కవి గుర్తు
మల్లెపూలు కాదు
ఎర్రమందారాలు.

చిక్కని చీకట్లో
మెరవాల్సింది
అక్షరమే.

మెరిసే అక్షర
పోరాట జ్వాలల్లో
దోపిడీ ,
బూడిద కావాలి.

ఆకలి తీర్చని
వ్యధకు
శ్రమ చేతుల
పిడికిలే సమాధానం.
జీవితం
ఓడిపోయిన దుఃఖం కాదు
సమున్నతంగా
తలెత్తి నిలవాల్సిన శిఖరం.

కవిత్వం మెరుపు
ఒక్క క్షణం కావచ్చు

అది
కన్నీటిని తుడిచే
పోరాట శక్తి.

అది సూర్య కిరణాల
మెరిసే
కాంతులను
గుండెల్లో నింపే శక్తి.

జీవితం
దుఃఖం పూసిన
ముళ్లచెట్టు కాదు.
లక్ష్యం నేర్పే
ఆశయాల
పోరు గట్టు.

రాలే కన్నీటిని
రగిలే
నిప్పు కనికలు చేసే
కవిత్వ
కొలిమి సమాధానం.

కడుపు ఆకలి తీర్చని వేదనకు
శ్రమజీవుల
పిడికిలి సమాధానం.

సమైక్య జీవన పోరాటం
నేల ఆకాశం అరణ్యం
నిండుకోవాలి.

జీవితం అడుగు
తడబడకుండా.

పోరాటం మారుపేరు
శ్రమ సంస్కృతి
నినాదమవ్వాలి.



–సిరిసిల్లా గఫుర్ శిక్షక్
9849062038

## హృదయ నది

నదులు ప్రవహిస్తుంటాయి
కొన్ని హృదయాలు విచ్ఛిన్నమై
పాయలు పాయలుగా పయనిస్తూనే ఉంటాయి!
ఆ కనుల కొలనులో ప్రవహిస్తున్న సాగరాన్ని
ఎన్ని హృదయాలతో ఆనకట్ట వేయగలము!!
ఆశలు ఆవిరై కమ్ముకుంటున్న మేఘాలు
ఎన్ని రోజుల్లో వర్షించగలవో చెప్పగలమా!!
ఆ నింగి ఆకాశపుటంచు.
కొండశిఖరాన్ని చుంబించినట్లే అనిపిస్తుంది కదా !
మేఘాల తాకిడి పెరిగినప్పుడు ఒంటరి కొండకు
గొడుగైనట్లే భ్రమిస్తాముకదా!!
పారుతున్న నదీజలాల్లో కలిసిపోయి
కనుమరుగవుతున్న జీవరాశుల ఉనికిని
ఏ శిలాశాసనాల్లోనైనా చూడగలమా?!!
పచ్చని చెట్ల నుండి వీచే చల్లని గాలి
ఎన్ని జీవితాలను శ్వాసించగలవు
నిశ్చలంగా కనిపించే సముద్రపు
గుండెలోతులను కొలిచే సాధనం
ఏ మనిషైనా కనుగొన్నాడా
గాయపడిన గుండెలోని లోతులను
ఎవరైనా పంచనామా చేయగలరా
గట్టు పైన నిలబడిన నీవు వారి బ్రతుకును
అంచనా ఎలా వేయగలవు
యదార్థమేమిటంటే
ప్రవహిస్తున్న నదులన్నీ
చివరికి కలిసేది సంద్రంలోనే !!
పయనిస్తున్న జీవితాలన్నీ ఆఖరికి కలిసేది
ఈ మట్టిలోనే !!



–జయంతి వాసరచెట్ల
9985525355

## బొడ్డు మల్లెలు

బడికిపోయే బాటపొంటి కర్ణపోళ్ళ
ఇంటిముందుండె బొడ్డుమల్లెచెట్టు గా
చెట్టును సూడంగనే దోస్తును జూషినట్టనిపించేది.
గప్పుడు ఆటోలు కూడా లేనిరోజులాయె సుబేదారి నుండి వడ్డెపల్లికి బస్సులు ఎప్పుడో వచ్చేటప్పుడు పోంగ పోయేటప్పుడు రాంగ పలకరించేవి .
నీయమ్మ ఈబస్సులు పాడుగాను ఎప్పుడుగింతె అనితిట్టుకుంట బాటపంటి బుజాన పుస్తకాల సంచేసుకొని పోటీలువడి నడ్సుకుంట పోయేటోళ్ళం దోస్తులందరం గల్సి
ఇగ సాయంత్రం ఇంటికి పోయేటప్పుడు బొడ్డుమల్లె చెట్టురాంగనె అందరం ఉరికిపోయి చెట్టును పట్టుకొని గట్టిగ ఊపెటోళ్ళం .
గప్పుడు జలజల రాలి గుమగుమ వాసన లిసురుకుంట మమ్మల్ని చేరేవి నవ్వుకుంట .
వాటిని అందరం తలిన్ని ఏరుకొని గుత్తిలాగ చేసుకొని గుప్పిట్లో పట్టుకొని సూస్కుంట ముర్సుకుంట నడ్శెటోళ్ళం .
ఇంటికి పోంగనె బ్యాగాడ పడేషి పూలన్ని వరండాల బోసుకొని ఒక్కొక్కటి తీసుకుంట జడమల్కలల్లుకునేది.
దారం లేకుండా దండల్లగానే నల్లని నా వాలుజడలో చేరి నాట్యమాడేవి నాబొడ్డుమల్లెలు.
బుగ్గలజాకెట్టు చుక్కల లంగ వేసుకొని నడుముల్ల పడేటి నావాలుజడలో చేరి ఎన్నెల్లు కురిపించు నా బొడ్డుమల్లెలు
నా కులుకు నా తళుకు చూసి నాన్న మనసంతా బొడ్డుమల్లెలతో నిండి పరిమళాలు ముద్దులై నానుదుట చేరేవి అమ్మ కళ్ళల్లో కాంతులు
నా చెంపల పూసేవి...



–వకుళవాసు
9989198334

## తల్లితండ్రులు –వారి పిల్లలు

ఇల్లు అనబడే సంసారపు బండిని
లాగే వారే తల్లిదండ్రులు
వారి పిల్లలు చాల ఎత్తు వరకు ఎదగాలని
ఆకాశానికి నిచ్చెన వేస్తారు
అందినంతవరకు పైకి ఎక్కిస్తారు
తాము చూడని కొత్తలోకాలు చూపిస్తారు
ఫలానా వారి పిల్లలు చంద్రుడి పైకి వెళ్ళారని
తారామండలం పై విహరించారని
చెప్పుకోవాలని ఆరాటపడుతారు
వారి కోసం ఎవరితోనైనా పోరాటానికి దిగుతారు
ఈ ఆరాటంలో,పోరాటంలో పిల్లలు ఎదిగారు
కాని,తల్లిదండ్రులను వృద్ధాప్యం ఆవరిస్తుంది
శక్తి సన్నగిల్లుతుంది.
ఇలాంటి దశలో వారికి సేవచేసి
వారి ఆశీస్సులు పొందుట పిల్లల ధర్మం
తల్లితండ్రులు పిల్లలను
వారి బాల్యావస్థలో ,
ఎదిగే వరకు వారి బాగోగులను ఎలాగ చూస్తారో
అలాగే పిల్లలు, తమ తల్లిదండ్రుల బాగోగులను కూడా,
వారి వృద్ధాప్యంలో,జాగ్రత్తగా చూడాలి
విదేశాలకు వెళ్ళిన పిల్లలు
తమ సుఖం తాము చూసుకుంటే,
వారినే నమ్ముకున్న తల్లిదండ్రులను
నిర్లక్ష్యంచేసి గాలికి వదిలేస్తే,
వారు జబ్బు పడితే చూసేవారెవరు
పోతే, కర్మకాండ చేసేవారెవరు
డబ్బుపడేసి మా విధి నిర్వర్తించామంటే
ప్రేమలు, అనురాగాలు, ఆప్యాయతలు,
అనుబంధాలు ఇంతేనా?
పిల్లలు జబ్బుపడితే కళ్ళలో
వత్తులు వేసుకుని సేవచేసిన తల్లిదండ్రులకు
చివరికి మిగిలే గౌరవం ఇదేనా?
తల్లిదండ్రులకు వూతకర్రగావుండాల్సిన పిల్లలు
వారిని గుండెకోతకు గురిచేస్తున్నారు
కర్మ సిద్ధాంతం ఎవ్వరిని వదలిపెట్టదు
కర్మ ఫలితం ఎవరైనా అనుభవించాల్సిందే
తమ తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలలో వుంచి
తాము ప్రవర్తించిన తీరును చూసిన
తమ పిల్లలు కూడా అలాగే తమ యెడ
ప్రవర్తిస్తే ఆశ్చర్యపడవలసిన పనిలేదు



–ఎస్ .ఎమ్ .షరీఫ్
9618045319



## జింక పిల్ల దాహం

(కథ)

ఒకసారి పొరుగు అడవికి చెందిన జింక పిల్ల ఒకటి దారి తప్పి సుందరవనమనే అడవికి వచ్చింది . దానికి విపరీతంగా దాహం అయ్యింది.

అది తన ఎదురుగా వచ్చిన కపటి అనే పేరు గల నక్కతో " ఓ నక్క మామా! నాకు చాలా దాహంగా ఉంది. ఇక్కడ నీటి కొలను ఎక్కడ ఉందో చెప్పగలవా!" అని అడిగింది. అది విన్న ఆ కపటి నక్క "ఇదిగో ! నేను వస్తున్న దారిలో ఈవైపుననే ఒకే ఒక్క నీటి కొలను ఉంది. ముందుకు వెళ్ళు" అని అంది . అది నక్క చెప్పిన వైపు వెళ్ళసాగింది.

ఇంతలో దానికి తన తల్లి చెప్పిన మాటలు జ్ఞాపకం వచ్చాయి. దాని తల్లి " ఎవరైనా మోసకారుల మాటలు నమ్మకు. ఒకవేళ అటువంటి పరిస్థితులు వస్తే ముగ్గురు, నలుగురిని అడుగు "అని చెప్పింది. వెంటనే అది ఎదురుగా వస్తున్న తోడేలుతో " ఓ తోడేలు మామా! ఈ వైపు నీటి కొలను ఉందా !"అని అడిగింది." ఉంది. "త్వరగా వెళ్ళు"అని ఆ తోడేలు జింకపిల్లను తొందర పెట్టింది.

తర్వాత దానికి అదే దారిలో కుందేలు ఎదురయింది . ఆ జింక కుందేలుతో " ఓ కుందేలు పిల్లా! ఈవైపు కొలను ఉందా! నాకు చాలా దాహంగా ఉంది" అని అంది. అప్పుడు కుందేలు దానిని ఎగాదిగా చూసి " నీవు అడవికి కొత్తదాని వలే ఉన్నావు. కొలను ఉంది . కానీ ఆ కొలను నీటిలో మొసలి , ఆ కొలను ఒడ్డున పెద్దపులి నీ కోసం కాచుకొని ఉన్నాయి. నీవు ముందుకు వెళ్లితే అవి నిన్ను బ్రతుకనీయవు" అని అంది. " మరి ఇంతకుముందు నక్క , తోడేలు నాకు ఎదురై ఈ వైపునకే కొలను ఉందని , నీటి కోసం వెళ్లమని చెప్పాయి. కానీ అక్కడ పెద్దపులి , మొసలి ఉన్నట్లు నాకు చెప్పలేదే! నీ మాటలను నేను ఎలా నమ్మాలి ?"అని అంది .

అది విన్న కుందేలు" అదిగో ! చూడు. ఆ నక్క , తోడేలు మరలి అవి మరో అడ్డ దారిలోనే తిరిగి ఆ కొలను వద్దకే వెళుతున్నాయి. అవి నన్ను గమనించలేదు . నీ గురించి అవి పెద్ద పులికి , మొసలికి చెప్పడానికే ముందుగా పరిగెత్తి వెళుతున్నాయి . లేకపోతే అవి ఆ వైపునకే ఎందుకు వెళ్తాయి ? నిన్ననే అవి అన్నీ కలిసి ఒక జింక పిల్లను పొట్టన పెట్టుకున్నాయి" అని అంది . అప్పుడు జింకపిల్ల" సరే ! కుందేలు పిల్లా! నేను మరో వైపుకు వెళతాను " అని ఆ జింకపిల్ల మరలి మరో వైపుకు వెళ్లింది.

అది ఆ దారిలో కనిపించిన ఎలుగుబంటితో " ఈ వైపు కొలను ఉందా! నాకు చాలా దాహంగా ఉంది! "అని ప్రశ్నించింది. తర్వాత నక్క , తోడేలు, కుందేలు చెప్పిన సంగతులను అది ఎలుగుబంటికి చెప్పింది . అప్పుడు ఎలుగుబంటి "ఇదిగో! ఈ చెట్టు వెనకాలే ఒక కొలను ఉ ంది. నీ దాహం తీర్చుకో !ఆ కుందేలు చాలా మంచిది . మంచిదానినే నీవు అనుమానించావు. నక్క, తోడేలు మోసం చేసే స్వభావం కలవి . వాటి మాటలను నీవు నమ్మవద్దు. నీవు కుందేలును ,నన్ను అడగడం వల్ల బ్రతికి పోయావు . త్వరగా నీ దాహం తీర్చుకో ! నేను కూడా నీకన్నా ముందే ఆ కొలను లోని నీటిని త్రాగుతాను . తర్వాతనే నీవు త్రాగు. నీ అనుమానం కూడా నివృత్తి అవుతుంది" అని దానిని ఆ కొలను వద్దకు తీసుకుని వెళ్లింది. ఇంతలో ఆ కుందేలు కూడా అక్కడికి వచ్చింది.

తర్వాత ఎలుగుబంటి తాను ముందుగా ఆ కొలనులోకి దిగి ఆ నీటిని త్రాగింది . తర్వాత జింకపిల్ల కూడా అందులోనికి దిగి తన దాహం తీర్చుకొని ఆ ఎలుగుబంటికి , కుందేలుకు తన ధన్యవాదాలు చెప్పి వాటి ద్వారా తన అడవికి దారి తెలుసుకొని సురక్షితంగా వెళ్ళిపోయింది. పిల్లలూ! అందుకే కపటుల మాటలను నమ్మకూడదు. మంచివారి మాటలను నమ్మాలి.



–సంగనభట్ల చిన్న
రామకిష్టయ్య,
9908554535

## ప్రతిరోజూ ఆమెకే స్వంతం

మహిని తనలో నింపుకున్న మహిళ
ప్రకృతికి ప్రతిరూపం
సృష్టికి ప్రతి సృష్టి చేయు అపర బ్రహ్మ
ఆమె
అమ్మతనం నుండి అంతరిక్షానికి
ఎగిసినా
అవని వైపే తన చూపు
మూలాలను వదలని ఆలోచనలు
తన వారిని మాత్రమేగాక
లోకక్షేమాన్ని సంక్షేమాన్ని కాంక్షించే
మానవతకు మరో రూపం
ప్రేమను పంచడంలో అమ్మయితే
అన్యాయాన్ని ఎదిరించటంలో
ఆదిపరాశక్తి
ఆదరణ చూపటంలో
అమృతమూర్తి
మార్గదర్శనం చేయటంలో
గురువు
అవరోధాలు అన్నిటినీ
అధిగమిస్తూ
ప్రగతి పథంలో సాగిపోతున్న
మహిళామణులందరికి
ఈ ఒక్క రోజు మాత్రమే కాదు
మహిళా దినోత్సవ సంబరం
ప్రతిరోజు ఆమెకే స్వంతం
ఆమె లేని జగతి శూన్యం
వనిత జత లేని బ్రతుకు వ్యర్థం
అందుకే ప్రతి నిత్యం చేయాలి
ఆమెకు వందనాలు
అదే లోకానికి శ్రీరామరక్ష



–డా.మైలవరపు
లలితకుమారి
9959510422

## మృత్యుంజయుడు

నిశ్శబ్దం ఒడిలో నిదురించే వేళ
నిశ్శబ్ద అడుగులతో వస్తుంది మృత్యువు!
నీడలా వెన్నాడుతూనే ఉంటుంది నిరంతరం
నీది కాదు మరుక్షణం అనే "మహా సత్యం"
మానవ జీవితం క్షణ భంగురం
భయం ఎందుకు.. అదే కదా శాశ్వత గమ్యం!
మృత్యువు అంటే ముగింపు కాదు
అది ఒక అనంత పరిణామం!
కను రెప్పపాటులో కరిగే కల కాదు
బ్రతుకు పుస్తకంలో ఆఖరి పేజీ కాదు...
అలసిన జీవికి దొరికే శాంతి, విశ్రాంతి
భయం ఎందుకు.. అదే కదా శాశ్వత గమ్యం !
నీ ఆశయమే నీకు రక్షణ కవచం
భయపడితే చావు ప్రతిరోజూ వస్తుంది
ఎదిరిస్తే అది దాసోహమంటుంది!
కాల గర్భంలో కలిసిపోవడం ఓటమి కాదు
తనువు మట్టిలో కలిసినా... నీ కీర్తి వెలుగుతుంటే
మృత్యువును గెలిచిన మృత్యుంజయుడవు నువ్వే!



–కందాళం రజనీ రాణి
94877 08043

# అణచివేత నుంచి ప్రతిఘటన వరకు తెలంగాణ సాహిత్యంలో మహిళా చైతన్యం

తెలంగాణ ప్రాంత చరిత్రను పరిశీలిస్తే ఇక్కడి తెలుగు సాహిత్యం కేవలం సౌందర్యాన్వేషణకు మాత్రమే పరిమితమైన సాహిత్య ప్రక్రియ కాదు. అది సమాజంలోని అన్యాయాలను ప్రశ్నించిన, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన చైతన్య వేదికగా కనిపిస్తుంది. ముఖ్యంగా మహిళల జీవితం, వారి కష్టాలు, శ్రమ, అణచివేత, తిరుగుబాటు భావనలు తెలంగాణ సాహిత్యం లో బలంగా ప్రతిధ్వనించాయి. ఫ్యూడల్ వ్యవస్థలో బందీగా జీవించిన మహిళ తన బాధను మాత్రమే కాదు, తన ప్రతిఘ టనను కూడా వ్యక్తపరచిన సందర్భాలు తెలంగాణ సాహిత్యంలో స్పష్టంగా కనిపిస్తాయి. ఈ నేపథ్యంలో మహిళా చైతన్యం తెలంగాణ సాహిత్యంలో ఒక శక్తివంతమైన స్రవంతిగా అభివృద్ధి చెందింది.

తెలంగాణ ప్రాంతం చాలా కాలం వరకు జమీందారీ, దొరల ఆధిపత్యం, పితృస్వామ్య విలువలతో నిండి ఉన్న సమాజం. రైతులు, కూలీలు మాత్రమే కాకుండా మహిళలు కూడా ద్వంద్వ దోపిడీకి గురయ్యారు. ఒక వైపు వర్గ దోపిడీ, మరో వైపు లింగ వివక్ష ... ఈ రెండు ఒత్తిళ్ళ మధ్య మహిళ జీవితం సాగింది. ఈ వాస్తవ పరిస్థితులు తెలంగాణ సాహిత్యాన్ని ప్రభావితం చేశాయి. ముఖ్యంగా ప్రజా సాహిత్యం, విప్లవ సాహిత్యం మహిళా సమస్యలను ముందుకు తెచ్చాయి.

1940లలో జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఈ దిశలో కీలక మలుపు. ఈ ఉద్యమంలో వేలాది గ్రామీణ మహిళలు పాల్గొన్నారు. వారు కేవలం సహాయకులుగా కాకుండా పోరాట యోధులుగా కూడా వ్యవహరించారు. ఈ అనుభవాలు ప్రజా పాటల్లో, కథల్లో ప్రతిబింబించాయి. ఈ నేపథ్యంలో విప్లవ కవి వరవర రావు రాసిన కవిత్వంలో మహిళా పోరాట స్ఫూర్తి స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన కవితల్లో మహిళను బలహీనురాలిగా కాకుండా ప్రతిఘటన శక్తిగా చిత్రించారు.

ఇదే ధోరణిని ప్రజాకవి గద్దర్ పాటల్లో మరింత బలంగా చూడవచ్చు. గ్రామీణ మహిళల బాధలు, ఆకలి, శ్రమను ఆయన పాటలు బలంగా ప్రతిబింబించాయి. "బానిసల బతుకుల్ని బద్దలు కొట్టాలి?

పోరాడే చేతుల్లోనే వెలుగుంది" అనే భావజాలం ఆయన ప్రజా గీతాల్లో ప్రతిధ్వనిస్తుంది. ఈ పాటలు మహిళలకు కూడా పోరాట చైతన్యాన్ని కలిగించాయి.

తెలంగాణ సాహిత్యంలో మహిళా చైతన్యాన్ని స్త్రీవాద దృక్పథంతో ముందుకు తెచ్చిన ప్రముఖ రచయిత్రుల్లో వోల్గా ఒకరు. ఆమె కథా సంపుటి "విముక్త" మహిళా స్వేచ్ఛ, వ్యక్తిత్వ స్వాధీనత వంటి అంశాలను తీవ్రంగా ప్రశ్నిస్తుంది. సంప్రదాయ కుటుంబ వ్యవస్థలో మహిళ ఎదుర్కొనే ఆంతర్య సంఘర్షణలను ఆమె సున్నితంగా చిత్రించారు. మహిళ తన జీవితంపై నిర్ణయం తీసుకునే హక్కు కలిగి ఉండాలని ఆమె రచనలు స్పష్టం చేస్తాయి.

అదే విధంగా స్త్రీవాద కవయిత్రి జయప్రభ కవిత్వం మహిళా చైతన్యానికి కొత్త దిశను చూపింది. ఆమె ప్రసిద్ధ కవిత "యశోదర" లో మహిళ మనసు, స్వేచ్ఛ కోసం చేసే అంతర్గత పోరాటాన్ని ప్రతిబింబించారు. ఒక సందర్భంలో ఆమె ఇలా ప్రశ్నిస్తుంది:

**"నన్ను తల్లి అని పిలిచే ముందు**
**నా మనసు ఎక్కడ ఉందో అడిగారా?"**

ఈ పంక్తులు మహిళను కేవలం తల్లి లేదా భార్య పాత్రలోనే చూడాలనే పితృస్వామ్య దృష్టికోణాన్ని తీవ్రంగా ప్రశ్నిస్తాయి.

తెలంగాణ ప్రాంతానికి చెందిన మరో ప్రముఖ కవయిత్రి జూపాక సుభద్ర రచనలు దళిత మహిళా అనుభవాలను సాహిత్యంలో ముందుకు తెచ్చాయి. ఆమె కవితా సంపుటి "అయ్యయ్యో దమ్మక్క" లో గ్రామీణ దళిత మహిళల జీవితం, వారి శ్రమ, అవమానాలు, ప్రతిఘటన స్పష్టంగా కనిపిస్తాయి. ఒక కవితలో ఆమె ఇలా రాస్తుంది:

**"నా చేతుల్లోని పగుళ్లే నా చరిత్ర**
**నా చెమటే నా స్వాతంత్రం"**

ఈ పంక్తులు దళిత మహిళా జీవితంలోని వాస్తవాన్ని బలంగా వ్యక్తం చేస్తాయి.

తెలంగాణ ఉద్యమం సమయంలో కూడా మహిళా చైతన్యం సాహిత్యంలో కొత్త ఉత్సాహాన్ని పొందింది. రాష్ట్ర హక్కుల కోసం జరిగిన ఉద్యమంలో మహిళలు భారీగా పాల్గొన్నారు. ఆ ఉద్యమ గీతాల్లో మహిళల పాత్రను గొప్పగా ప్రతిబింబించారు. ఈ సమయంలో వచ్చిన పాటలు మహిళను కేవలం కుటుంబ సభ్యురాలిగా కాకుండా ఉద్యమ సైనికురాలిగా చిత్రించాయి.

అయితే తెలంగాణ తెలుగు సాహిత్యంలో మహిళా చైతన్యం పూర్తిగా సమానత్వాన్ని సాధించిందా అనే ప్రశ్న ఇంకా మిగిలే ఉంది. చాలా సందర్భాల్లో మహిళా పాత్రలు పురుష రచయితల దృష్టికోణంలోనే చిత్రీకరించబడ్డాయి. మహిళా అనుభవాలు పురుషుల ఊహలో మాత్రమే నిలిచిపోయిన సందర్భాలు ఉన్నాయి. అందుకే మహిళలే తమ అనుభవాలను స్వయంగా రాయాల్సిన అవసరం పెరిగింది.

ఇటీవలి కాలంలో కొత్త తరపు రచయిత్రులు ఈ లోటును పూరించేందుకు ముందుకు వస్తున్నారు. వారు లింగ అసమానతతో పాటు కులం, వర్గం, ప్రాంతం వంటి అస్థిత్వం అంశాలను కూడా తమ రచనల్లో ప్రతిబింబిస్తున్నారు. సామాజిక మాధ్యమాలు కూడా వారికి ఒక కొత్త వేదికను అందించాయి. అంతిమంగా చెప్పాలంటే, తెలంగాణలో తెలుగు సాహిత్యం మహిళా చైతన్యానికి కేవలం ప్రతిబింబం మాత్రమే కాదు. అది ఒక ఉద్యమ శక్తి. మహిళా అనుభవాలను సాహిత్యంగా మార్చడం ద్వారా సమాజాన్ని ప్రశ్నించే శక్తిని ఇది కలిగించింది. అణచివేతను సహించే పాత్ర నుంచి ప్రశ్నించే స్వరంగా మహిళ ఎదగడంలో తెలంగాణ సాహిత్యం కీలక పాత్ర పోషించింది. ఇప్పటికీ సమాజంలో పితృస్వామ్య విలువలు పూర్తిగా తొలగి పోలేదు. అందువల్ల మహిళా చైతన్యం సాహిత్యంలో మరింత బల పడాలి. సమానత్వం, గౌరవం, స్వేచ్ఛ అనే లక్ష్యాలను సాధించడానికి సాహిత్యం ఒక శక్తివంతమైన ఆయుధంగా కొనసాగాలి. తెలంగాణలో మహిళా స్వరం ఇంకా బలంగా వినిపిస్తేనే సాహిత్యం నిజమైన ప్రజాస్వామ్యాన్ని ప్రతిబింబిస్తుంది.



**-డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్**
9849328496.

---

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1728వ రోజు 'తరాల మధ్య అంతరం' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'తరాల మధ్య అంతరం' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839



-సంపాదకులు


---

## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



అడ్మిన్: రమాదేవి కులకర్ణి 8985613123
నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ



### గ్యాస్ రాజ్యం

వంటగది
ఒక రాజ్యం అయితే,
సిలిండర్ రారాజు
స్టవ్ మాత్రం సేవకుడు,
మనమేమో నిమిత్త మాత్రులం.
ఉదయం టీ ఘుమఘుమలతో
లేచే నా కథ మొదలు,
సిలిండర్ తిప్పి చూస్తే,
ఖాళీగా ఉండే వైనం .
"ఇంకో రెండు రోజులు ఉంటుందిలే"
అన్న నిన్నటి మాట,
ఈరోజు మాత్రం అది
బూటకపు మూట .
డీలర్‌కి ఫోన్ చేస్తే,
"బుక్ అయింది, వస్తుంది"
అంటాడు,
ఆ 'వస్తుంది' అన్న మాటతో
మనల్ని రోజూ మోసం చేస్తాడు
తను.
లైన్లో నిలబడితే,
ముందు వాళ్లు నలభై మంది,
వెనుక చూసేసరికి,
మరింత పెరిగే సందడి!.
పక్కింటి వాళ్లని అడిగితే,
"మాకు కూడా అయిపోయింది"
అంటారు,
గ్యాస్ కంటే ఇబ్బంది,
ఆ మాట వినడమే.
చెరుకు రసం తాగుతూ,
హోటల్‌లో తినాలనుకుంటే,
బిల్ చూసి మనసు,
మళ్ళీ ఇంటికే పరుగెత్తుతుంది!.
గ్యాస్ ఉన్న రోజుల్లో,
దర్జాగా వంట చేస్తాం,
లేనప్పుడు మాత్రం,
పచ్చడి-అన్నంతో
బ్రతుకు గడుపుతాము.
ప్రభుత్వ ప్రకటనలు వినిపిస్తాయి,
"సరఫరా మెరుగుపడుతుందని "
మన పొయ్యి మాత్రం నిశ్శబ్దంగా,
అది ఎప్పుడు అన్న ప్రశ్న
అడుగుతుంది!.
ఒక చిన్న సిలిండర్ కోసం,
ఇన్ని తిప్పలా.....?
గ్యాస్ కొరత అనే సమస్య
ప్రతి ఇంటికీ మారింది
కొరకరాని కొయ్యలా...
మంట వెలిగితే నవ్వులు,
మంట ఆగితే బాధలు,
గ్యాస్ కొరత నేర్పింది,
జీవితానికి కొత్త పాఠాలు!.
సిలిండర్‌లో తరిగిన గ్యాస్
మన ఒంట్లో మాత్రం పెరిగిన
న్యూస్.
అమ్మో గ్యాస్ అంటూ...
ఆకలికేకలతో అలమటించే
ఖాళీ కడుపులు
అలసిపోతున్నాయి
ఎదురుచూపులతో.

**-ఝాన్సీ ముదుంబై**
హైదరాబాదు

### అమృతాహారం

జగతిలో..ఎక్కడో.. ఏవో
రెండు దేశాలు...
దురహంకారంతో
కక్షలు పెంచుకుని.. యుద్ధానికి
కాలుదువ్వి...
బాంబుల వర్షం కురిపిస్తూ
ధరణి ఒడిని రుధిరంతో
తడుపుతూ...
అర్ధరహిత పంతాలకు పోయి
చమురు క్షేత్రాలపై దాడులు
చేస్తూ
చమురు రవాణాకు ఆటంకం
కలిగిస్తూ
ప్రపంచ దేశాలకు ఇబ్బంది
కలిగిస్తుంటే...
సామాన్య మానవులకు
నిత్యావసరమైన గ్యాస్ సిలిండర్పై
అనూహ్యమైన ప్రభావం
పడుతుంటే
నిత్య జీవనం అస్తావ్యస్థం
అవుతుంటే
ప్రభుత్వాలు సైతం ఏమి చేయలేని
నిస్సహాయ స్థితికి
దిగజారిపోతుంటే...
సహజ ఆహార ఉపాయాలు
కనులు తెరుస్తున్నాయ్
అపక్వాహారంతో కలిగే
ప్రయోజనాలు
నోళ్లు తెరుస్తున్నాయ్
వండిన వంటలు మృతమని
పచ్చి కూరగాయలు, పండ్లతో
చేసినవి
అమృతాహారం అని గొంతెత్తి
పాడుతున్నాయి..
ప్రకృతి చికిత్సాలయాలు....
రుచులు రుచులుగా వండిన
వంటలకు అలవాటు పడిన జిహ్వ
గగ్గోలు పెడుతోంది....
పచ్చి కూర ముక్కలు, పల్లీలు,
బఠాణీలు
పంటి కింద రుచి పచి లేవని
మది మొరాయిస్తోంది....
గ్యాస్ బండ ధర... ధరణి
నుండి
నింగికి ఎగిరిపోతే....
అతి సామాన్య టిఫిన్ బండ్లు
నడిపే వారి బ్రతుకులు
అతలాకుతలం
అయిపోతుంటే...
అన్నెం పున్నెం ఎరుగని
అమాయకుల
జీవితాలు
చిన్నాభిన్నం అవుతుంటే...
మది వేదనతో అచేతన స్థితి
లోకి
జారిపోయింది...!!

**-లక్ష్మీ పద్మజ దుగ్గరాజు**
నాగార్జున సాగర్

### అనాగరీకులకు పెట్టవలసిన వంట

ఆటవిక దశలో మానవులు తిన్నది కందమూలాలే.
నిప్పు కనిపెట్టక ముందు వంటటెక్కడుంది!
ఆకులూ అలములూ తిని బ్రతికిన వాళ్ళమే కాదూ మనం!
అప్పటినుండీ ఇప్పటివరకూ మనకు తెలిసిన జంతువులు ...
రుచికరమైన వంటలను వండుకు తింటున్నాయా!
జిహ్వాచాపల్యాన్ని తీర్చుకుంటున్నాయా!
అవి బ్రతకటం లేదూ బేషుగ్గా.
చాన్నాళ్లుగా రుచులకు అలవాటు పడిపోయాం .
షడ్రుచులకు అలవాటు పడిన వాడక్కడితో ఊరుకుంటేగా!
ఆ రుచల తోటే షడ్వికారములను పెంచి పోషించాడు.
అసూయాద్వేషాలకు గూడు కట్టుకున్నాడు.
తన బతుకు కోసమే అందరినీ మింగేస్తున్నాడు.
వంట చెరుకు వాడికో లెక్కా.
వంట చెరుకుగా వాడే గ్యాస్ను యుద్ధాలతో నాశనం చేస్తున్నాడు.
నాశనం చేస్తున్నాననుకుంటున్నాడే కానీ ...
నాశనమైపోతున్నానని గ్రహించడా చవట.
మంట లేని వంటతో పెరుగుంటే చేసేవాడు కాదీ యుద్ధం.
ఏనాటికీ తెచ్చేవాడు కాదు గ్యాస్కు కొరత.
షడ్రుచులు లేకుంటే షడ్వికారముల పాలయ్యేవాడు కాదు కదా!
అందుకే మంట లేని వంటకు అలవాటు చేయాలీ ...
నాగరిక ప్రపంచంలో తగలబెట్టి తగలబడుతున్న అనాగరీకులను.

**- విత్తనాల విజయకుమార్**
9985117789

### వంటా వార్పూ లేదా ? యుద్ధాలకు అంతం ఉందా ?

అమ్మ చేతి వంటకాల కోసం
ఎదురుచూస్తూన్న పిల్లల కోసం
తల్లడిల్లిపోతూ తల్లులంతా
ఎదురుచూసారు గ్యాస్ కోసం.
అర్థంపర్థం లేని పంతాలకు
దేశాల మధ్య రేగిన జ్వాలలకు
బలౌవుతూ అమాయక ప్రజలు
అల్లాడిపోయె ఆకలిబాధలకు.
ఏ ఇళ్ల లోన గ్యాసు లేదు
వంటలకు మరో దిక్కు లేదు
హోటల్ కి వెళ్లి తిందామంటే
అక్కడ కూడా గ్యాస్ లేదు.
మంట లేని వంటల కోసం
మైక్రో వేవ్ లో పాత్రల కోసం
బజారంతా తిరగక తప్పలేదు
ఇండక్షన్ స్టావుల కోసం .
నేనూ, నాదనే అహంకారం
మొండి ప్రభుత్వాల మూర్ఖత్వం
మధ్యలో నలుగుతున్న జనం
ఆ యుద్ధాలకు లేదా అంతం .

**-శ్రీదేవిప్రభాకర్ తంత్రవహి**
హైదరాబాద్.

### ఆరోగ్య ముద్ర

"నిద్ర సుఖమెరగదు
ఆకలి రుచెరగదు"అని సామెత.
సుఖ నిద్రకు ముఖమల్ దిండ్లు
హంసతూలికాతల్పాలు
అట్టహాసాలు అక్కర్లేదు.
ఆరోగ్యానికి
రోగం అంటకుండా ఉంటే
చెట్టు కింద సేదదీరి
చెయ్యే తలగడగా తనువు వాలిస్తే
తక్షణమే సుఖనిద్ర చేతులు చాచి
తన ఒడిలో మనకు ఇస్తుంది
విశ్రాంతి.
మానసిక శాంతితో పాటు
కాయ కష్టం
సుఖ నిద్రకు దివ్య ఔషధం.
మనసుకు శరీరానికి
పని ఉండేకొద్దీ సుఖనిద్ర భద్రమే
"కొని కొని గుహలు లేకున్నవే
పరుండుటకు
దూది పరుపులేలా"
అన్నాడు భాగవతకర్త.
సుఖ నిద్రకు
ఆహార విహార ఆలోచనావిధానం
శరీర శ్రమ వగైరాలు
దివ్య ఔషధాలు.
అన్నింటికన్నా ముందు
ఒకరిని గూర్చి
ఆలోచించడం మాని
పరులకు సాయం చెయ్యడం
మటుకే చేస్తే
పడుతుంది సుఖ నిద్ర.

**-డా.సి.వసుంధర**

### పరమ పవిత్రం

సుఖనిద్ర పరమ పవిత్రం
జాగ్రత స్వప్న సుషుప్తి
మనోస్థితి త్రయపు వ్యవస్థ.
సుషుప్తి సుఖనిద్రకు
ప్రమాణాల స్వచ్ఛత.
మానసిక, శారీరక, ఆధ్యాత్మిక
శక్తి భ్రమణాల స్వస్థత.
ధన సంపదలతో
సౌభాగ్యవంతులమని అనలేం
సమయానికి ఆహారం
సుఖనిద్ర కలిగి ఉండటమే
ఆరోగ్యం
తృప్తిగా చాటగలిగే సౌభాగ్యం.
నిద్ర అనే యంత్రాంగం
శరీర అంతర్గత అంగాలకు
భాగాలకు ప్రాణవాయువు
అవసరాలను తీర్చడమే,
బాహ్య అంగాల ఆధిపత్యాన్ని
నియంత్రించడానికి
చేయించే ప్రక్రియయే
ఆదమరచిన సుఖనిద్ర.
ధూషిత ఆలోచనలు
వికృత కార్యకలాపాలు
శుద్ధపరిచి
శారీరక మనోవికాసాల
పునఃస్థాపన చేసి
పావనపరిచే కార్యమే
సుఖనిద్ర.
శ్రమించిన కాయానికి సేదనిచ్చి
బలాలను చేకూర్చేందుకు వొనర్చే
రీఛార్జ్ ప్రక్రియ
పునః ఉత్సాహాలతో
జీవించడానికి
తావిచ్చే సుఖనిద్ర.
ధనవంతుడైనా, పేదవాడైనా
ధైర్యవంతుడైనా, పిరికిపందైనా
దాసుడైనా, ప్రభువైనా
సుఖనిద్రతో
సద్గుణ శోభితుడవుతాడు
సుఖనిద్ర ఎంతో పరమ పవిత్రం
కలుషితం లేని శుద్ధ సుఖనిద్ర
పుణ్యకార్యాల ఫలం
సిద్ధించిన అద్భుత వరం.

**-రాజప్ప**

### స్వీయ క్రమశిక్షణ

ఆకలి రుచెరగదు
నిద్ర సుఖమెరగదంటారు
పులిసిన తనువుకు విశ్రాంతి
అలసిన మనసుకు నిద్ర సుఖమే.
అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శనిలా
సంపదలున్నంత మాత్రాన
సుఖనిద్ర దొరుకుతుందనుకుంటే
మన భ్రమే కానీ మరోటి కాదు.
కంకర కుప్పైనా పట్టె మంచమే
కరుకు నేలయినా పట్టు పరుపే
రైలు చప్పుళ్లయినా
రాళ్ళ చప్పుళ్లయినా
చెవిటి ముందు శంఖమే.
సుఖమెక్కువైతే ఆరోగ్యం శూన్యమే
ఆలోచనలెక్కువైనా నిద్రకు
దూరమే
పారిశ్రామిక ప్రగతి నీడలో
మూడు షిఫ్టులతో కొంత
సాంకేతిక యుగంలో మరింత.
జీవ గడియారం
చిందర వందరే.
చరవాణి చొరబడిన తదుపరి
ఆకలి నిద్రలు
అలమటిస్తున్నాయి
ఏది ఏమైనా
స్వీయ క్రమశిక్షణలు
శ్రీమంతులను చేస్తాయి.

**-నగునూరి రాజన్న**

### హాయిగా నిదురపో అన్నిటినీ మరచి!

సుఖనిద్ర మహా వరం!
ప్రాప్తం కాదది అందరికీ!
కొందరు తిన్న వెంటనే
కునుకు తీస్తే
ఇంకొందరు మంచంపై వాల
గానే నిద్రపోతారు!
బాదరబందీ
చీకూచింత లేనోళ్లు
అన్ని భోగాలు అనుభవించేవారు
నిద్రపోతారు సుఖంగా ఎప్పుడూ!
సాఫ్ట్వేర్ ఉద్యోగులు పని
ఒత్తిడితోనూ
ఇల్లు గడవని పేదలు రేపటి
గురించి చింతిస్తూ
బంగారంపై అప్పిచ్చే ఆసామి
ఏరోజు ఏ దొంగ బంగారం
దోస్తాడో అని
నిద్ర పోరు ఎపుడూ జీవితంలో!
రోగులకు నిద్ర పట్టదు
అప్పుల బాధతో ఉంటే
అసలే నిద్ర రాదు!
పగలంతా శ్రమించిన కష్టజీవులు
ఊయలలో ఊగులాడే పసిపాప
ఇట్టే నిద్ర పోతుంది
రోజూ రాత్రిళ్ళు!
అందుకే మీరు వేకువనే లేవాలి!
నడకో పరుగో చేయాలి
అనుదినం!
చెమట పట్టేలా వ్యాయామం చేయాలి!
రాత్రిళ్ళు భోంచేసి
తొందరగా పడుకోవాలి!
టీవీ, చరవాణిల జోలికి పోవద్దు!
కమ్మని సంగీతం వింటూ
లైట్లు లేకుండా
పరుంటే నిద్రాదేవి నీ వశం!
సుఖనిద్ర అనే వరాన్ని
ప్రసాదిస్తుంది!.

**-కోలా సత్యనారాయణ**

### ప్రశాంతత

నిద్ర సుఖమెరుగదు
ఆకలి రుచి ఎరుగదు.
కష్టం చేసి అలసిన కాయం
మంచాలు పరుపులతో పనిలేదు
కళ్ళు మూసుకుంటే
హాయిగా నిద్రలో జారుకోవడమే
ఎక్కడ ఉన్నామో
ఎవరు చూస్తున్నారో
ఏమీ పట్టని స్థితి
ఎంత గందరగోళం
జరుగుతున్నా
పని చేయని చెవులు.
బండి నడిపేప్పుడు నిద్రలో
వెళ్ళిపోతే ఎన్నో ప్రాణాలు
గాలిలో.
సుఖనిద్ర ఆరోగ్యానికి హేతువు
ఆలోచనలతో బరువెక్కిన మనసు
కంటినిండా నిద్రకు దూరం
తెల్లవార్లు చేస్తారు జపం
సాంకేతిక వ్యవహారం
సుఖనిద్రకు దూరం
అతినిద్ర అనారోగ్యం
సుఖనిద్ర వరం!!

**-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి**

---

## కవితార్చన



అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319
"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

### కాస్త చేయందించ కూడదు?

దౌర్భాగ్యపు మనస్తత్వాలు
స్పందించిన మనసు
సువాసన లేని విరుల వంటివే కదా !
కాగితపు పూలు అందానికే గాని
సువాసనకు పనికిరానివేగా!!
ధనముకు దానం , చదువుకు వినయం....
మనిషికి సహాయం చేయాలని మనసు..
ఇనుములా తృప్పుపట్టక
గంధపు చెక్కలా అరిగి కరిగిపోయే... తనువు
సమ సమాజానికి నవ్య సమాజానికి ఉండాలి...
సంద్రపు నీళ్లు దాహం తీర్చలేవు కదా...
కనీసం బురదగుంట నీరైన కావాలి.
పెను అగ్ని ప్రమాదం తప్పించుటకు.
లేకుంటే కసువుతినే పశువే మిన్న కదా?
పాలిస్తూ... శిశువు కు పుష్టిని, తుష్టిని ఇచ్చు గదా?
నింగి, నీరు,నిప్పు,నేల పరుల కొరకే....
మానవత్వం లేని మనిషి మాత్రం
స్వార్థం కొరకే. దురాశ కొరకే....
చిటికలోన చిదిగే, బుడగ లాంటి బ్రతుకుకు
మాటలు గారడీతో మోసం చేసే మనసులు ఎందుకో...?
కాస్త చెయ్యి అందించకూడదు?
పంచుటలో అందం... పొందుటలో లేదు సుమీ....

**-గణస్వామి మండల**
+91 88859 20090

### పేమైక జీవనం

మా నవ తేజం
ఇది మన నైజం
ప్రేమల కలగలుపు
మంచిని పంచే గుణం
అదే మన భారతీయత.
కులం మతం ప్రాంతం
ఆచారం సంస్కృతి నాగరికతల
కలబోత విశాలత్వమే
విలువలున్న అందమైన ప్రియత్వమే.
పేరున్న మనసు
మనసున్న రాగం
రాగమైన గెలుపు
గెలుపుగా వచ్చిన శ్రమ
శ్రమను నేర్పిన విశాల గుణం
విశాల గుణమును కొనసాగించు ఓపిక
ఓపికను నమ్ముకున్న ప్రాణం
ప్రాణమును నిలుపుతున్న మంచితనం
మంచితనమును ఆరాధించే దైవత్వము
దైవత్వమును విశ్వమునకు పంచే కరుణ
కరుణను నడుపుతున్న మానవత్వం
అదే మన తత్వం అద్భుత విశాలత్వం

**-ప్రత్యూష మిట్టపల్లి**
+91 73861 84062

### కష్టం మీద సమరం

ఒక యుద్ధం
ఆయుధమై వర్తక వాణిజ్యాన్ని కుదిపి వేస్తున్న సన్నివేశం.
ఒక బతుకు లోంచి రక్తం కన్నీరై
దుఃఖంలా పొంగి పారుతోంది.
యుద్ధం మత్తులో చిక్కుకున్న ఇంధనం సముద్ర అలల
మీద నావలా ఊగుతోంది..
పచారీ సరకుల ధరల పట్టిక చూసిన
వినియోగదారుడు వింత బొమ్మే అయ్యాడు.
ఏ వస్తువును తాకినా
చెయ్యి మండిపోతోంది.
ఉల్లిగడ్డ కొయ్యక ముందే కళ్ళలో నీళ్లు తిరుగుతున్నాయి.
మానవ వనరుల శక్తి
సమాధానం దొరకని యక్ష ప్రశ్న అయ్యింది.
సోషల్ మీడియాల గందర గోళాల మధ్య
సాటి మానవుడి గుండె కోత వినడం సాధ్యమా?.
గాలికి ఆవేశం వచ్చి
కొత్త పేరు పెట్టుకుని తుఫానులా విజృంభిస్తోంది
నిరుపేద ఆకలి పంజరం లో చిక్కుకున్న అమాయకపు
పిట్ట అయ్యాడు.
కొడుకు తన కోసం ఇంద్ర భవనం నిర్మిస్తాడని
ఒక పిచ్చి తల్లి విరిగిన ఇటుక మీద
నిలబడి కలలు కంటోంది.
మానవ సంబంధాలకు మూలమైన
హృదయాల్లో
సంకుచిత్వం చోటు చేసుకుంది.
మనిషిని కష్టమనే కొండచిలువ కదలడానికి
వీల్లేకుండా చుట్టుకుంది
నలుగురు
ఏకం అయితే తప్ప నాలుగు దిక్కుల్ని
ఒకటిగా చెయ్యలేరు
అదిగో
వానప్రస్థం లోకి అడుగు పెట్టిన పెద్దాయన
వార్తలు కట్టేసి వాకిట్లో నిలబడ్డాడు.
నడు
చెయ్యా చెయ్యా కలిపి
పోరాట పటిమను ఆయుధం గా మలిచి
కష్టం మీద సమరం ప్రకటిద్దాం..!

**-భమిడిపాటి వెంకటేశ్వరరావు**
+91 72859 51828

### ఇంటికి వెలుగు ఇల్లాలు

"ఇంటికి దీపం ఇల్లాలు"
అన్నది అక్షర సత్యం
ఆమె నవ్వు ముంగిట విరిసిన
మల్లె తోట..
ఆమె నడక ఇంటికి ఒక
క్రమశిక్షణ బాట..
"ఇంటిని చూసి ఇల్లాలును చూడు" అన్నది
పెద్దల మాట.!
అది శుభ్రత మాత్రమే కాదు
సంస్కారాల పూదోట.!!.
నేటి ఆధునిక యువతీ..
వినుమా ఒక చిన్న మాట
వేషభాషల మార్పు కాదు
అసలైన ప్రగతి
మన గతాన్ని గౌరవించడమే
నాగరికతకు ప్రతికృతి..
అమ్మ నేర్పిన అణకువలో ఉంది అంతులేని శక్తి
అమ్మమ్మ చెప్పిన కథల్లో దాగుంది బ్రతుకు
యుక్తి..
జీన్స్, టీషర్టులు శరీరాన్ని అలంకరించవచ్చు
కానీ మాతృత్వం, మమకారం మనసును
వెలిగించాలి..
ఉద్యోగ వేటలో
ఎన్నెన్ని శిఖరాలు అధిరోహించినా
కట్టుబొట్టులో కనిపించే
ఆ గరిమను విడవకుమా.!
సంప్రదాయం అంటే
సంకెళ్ళ నిర్బంధం కాదు
అది మన మూలాలను గుర్తు చేసే
ఒక నిధి అని మరువకుమా.!!.
ఆధునికతతో పోటీ పడుతూనే ఆత్మీయతను
పంచు
నేటి ఇంటికి వెలుగై,
రేపటి తరానికి
స్ఫూర్తిని పంచు..

**-అయిలా సోమ నరసింహాచారి**
98484 80442

### మారాలి (జనం )మనం

చరవాణి లో నే మునిగిపోతూ
కంప్యూటర్ ముందే కరిగి పోతూ
అలసటతో కంటి నిద్ర కోల్పోతూ
నిత్య కృత్యంగా మారిపోతూ...
పనిలో పూర్తిగా నిమగ్నమై
కుటుంబాలకు దూరమై
పక్కనున్నవారిని మర్చిపోయి
దూరాన ఉన్న వారికై మైమరచి.
యాంత్రిక జీవనము గడుపుతూ
మంచి చెడులను మర్చిపోతూ
విచక్షణలేని అనుబంధాలకోసం
వివేకం మరిచి పరుగులు.....
అవసరమైనంతవరకే వినియోగిస్తే
అభివృద్ధికి నీవు సోపానమైతే
మనసులో భావాలకు
ప్రాముఖ్యతనిస్తే
తప్పక మారుతుంది ప్రస్తుత
చిత్రము.

**-కాను కొలను**
**వేంకటసుబ్రమణ్యేశ్వరరావు**
+91 99485 15560

# యుద్ధ మారణ హోమం



అగ్ర రాజ్యాల అధిపత్య ముసుగులలో
ఆధునిక యుద్ధాలు
అనాదలవుతున్న అమాయకపు ప్రజలు
స్వేచ్ఛగా ఊపిరి పీల్చలేని సకల జనులు
అలసిన రెక్కలతో గూడు చేరని పక్షులు
పగిలిన గోడల మధ్య దాగి
భయంతో వణుకుతూ
ఆశల రెక్కలు విరిగి రక్తం చిమ్ముతూ
ఒళ్ళు గగ్గురు పెట్టే దృశ్యాలు చూడలేక
బ్రతుకు జీవుడా అనుకుంటూ
పొరుగు దేశాలలో
పెరుగుతున్న వలసలు .
ఆచూకీ లేని కన్న వారికోసం
ఆశగా ఎదురు చూస్తున్న అభాగ్యులు
అవిశ్రాంత ప్రయాణంలో నిరాశ్రయులు
అల్లాడుతున్న పసి హృదయాలు
ఎండిన కన్నీటి దారల చెక్కిళ్ళు
పిల్లల భద్రత కోసం
మాతల కళ్ళలో కన్నీళ్ళు
ఆకలి భయంతో
నిద్ర మరచిన సామాన్యులు.
అగ్ని కణికల మెరుపులతో
ఎర్ర బారుతున్న మేఘాలు
మసి బారుతున్న
ఆకాశపు దివ్వెలలు
మాయని మరకల నెత్తుటి వాసనలు
రక్తపు మడుగులతో నగరాలు.
దేశార్థం ప్రాణాలు కోల్పోతున్న
సిపాయలు
క్షిపణుల దాడులతో
నేల గుంతలు
మౌన వ్రతంలో పొరుగు దేశాలు
శాంతి కోసం చేతులు ఎత్తాలి
మానవత్వంమేల్కొని ప్రకాశించాలి
ఈ మారణహోమానికి
ముగింపు పలకాలి
అశ్రుమయ భూమి
పచ్చని చిగురులు తొడగాలి.



–డా॥సుధాకర్ గుమ్మడి
9440125495

ఈ వారం నుండి మరో శీర్షిక ప్రముఖ నవలా రచయిత పి.చంద్రశేఖర ఆజాద్ 'మేంగో' కాలమ్' -సంపాదకులు

# 'మేంగో' కాలమ్'





## 'మేంగో' ఇజం

– పి.చంద్రశేఖర అజాద్
– 92465 73575

నా ముద్దు పేరు 'మేంగో'

మీ అందరికీ నిక్‌నేమ్స్, ముద్దు పేర్లు ఉంటాయని నాకు తెలుసు.

అసలు కంటే కొసరు ఎక్కువ అంటారు కదా! అలా ముద్దు పేర్లతో సెలబ్రిటీలు అయ్యారు. రాజకీయాల్లో, సినిమా ల్లో, చివరికి సాహి త్యంలో కూడా! అందుకని, ఇది మామి డి పండ్ల సీజన్ కాదు. అందరికీ రకరకాల కాలమ్స్ ఉన్నాయి. ఇది నా కాలమ్. ఇక ముందు మా ట్లాడుతుంటాను. దిసీజ్ ది వాయిస్ ఆఫ్ చిల్డ్రన్. ఇందులో మగ పిల్లలూ, ఆడపిల్లలు కూడా ఉంటారు. జెండర్ సమస్యే లేదు. నో క్యాస్ట్. అయితే, మా పిల్లలకు కులం ఉంది. కానీ, మా వాయిస్‌కి లేదు. అలాగే జిల్లా , రాష్ట్రం, దేశం అనేది కూడా లేదు. ప్రపంచ పిల్లలందరూ ఒకటే.

ఇప్పుడు స్త్రీ వాదం, దళితవాదం, మైనారిటీ వాదంలాంటివి చాలా ఉన్నాయి. అందుకని, మేం కూడా 'పిల్లల వాదం' అని నామకరణం చేస్తున్నాం.

నాకు ముందే తెలుసు. మీలో కొందరు తొందరలోనే పిల్లల్ని కూడా చీల్చుతారని. ఇందులోకి అన్ని వాదాలు తీసుకుని వస్తారని. మాలో మాకే విభేదాలు కూడా సృష్టిస్తారని, డోంట్ కేర్. మేం. రెడీ !

ఇంకా 'ఇజాల' గురించి మాట్లాడాలి. ప్రపంచంలో రకరకాల ఇజాలు ఉన్నాయి. బుద్ధిజం, మార్క్స్ ఇజం , లెనినిజం, అలాగే వంద ఇజాలు. ఆధ్యాత్మికంగా ఎన్నెన్నో ఉన్నాయి. అందుకని నేను ఇప్పుడు 'మేంగో ఇజం' అని కాయిన్ చేసుకున్నాను.

ఇది పిల్లలవాదం అయినప్పుడు 'మేంగో' అని ఎందుకు పేరు పెట్టావు. ఇది వ్యక్తి వాదం కాదా! నీకు కీర్తి కండూతి ఈ వయసులోనే మొదలా? అని కొందరు విమర్శిస్తారు. 'య్యా ...!' ఇప్పటి వరకు అన్ని ఇజాలు మగయినా, ఆడయినా, వ్యక్తుల పేరుతో ఉన్నాయి. అంచేత, మీరు ఆ రూట్‌లో రావద్దు 'బ్రోస్.

నాకు కీర్తి వస్తుందో రాదో గాని, అపకీర్తి మాత్రం గ్యారంటీ. నో డౌట్. నా 'మేంగో ఇజం' మీద కూడా దాడులు జరుగుతాయి. అది పిల్లలందరి మీదా కాకూడదు. ఇందులో మీకు నచ్చినవి మా పిల్లలందరివీ. విమర్శలు మాత్రం నావి. జవాబులు చెప్పేది నేను, తిట్లు తినేది నేను. అందుకని నేను 'మేంగో ఇజం' కు పరిమితం అవుతున్నాను.

మా పిల్లల్లో కళాకారులున్నారు, మేధా వులు ఉన్నారు, రచయితలున్నారు. అందుకని వారికి మనవి చేసేదేమిటంటే, మీరందరు కూడా మీ మీ పేర్లతో రకరకాల 'ఇజాలు' ప్రకటించండి. వెయ్యి పూలను వికసింప జేయండి. మనం సోషల్ మీడియాను, ఫేస్‌బుక్‌ని, బ్లాగు లని, పత్రికల్ని , ఒక్క మాటలో చెప్పాలంటే ఆధునిక వేదికలను ఉపయోగించుకుందాం.

ఇది ఇంట్లో మాత్రమే !

ముందు ముందు అనేక రకాల రసాలు ఉంటాయి. వ్యంగ్యం, అను భూతి, హాస్యం, ఎమోషన్స్, అన్ని రసాలు ఏక కాలంలో ఉప్పొంగటం లాంటి ఫీట్స్ ఉంటాయి. ఇందులో తెలుగు మాత్రమే కాదు. ఇంగ్లీష్ పదాలు కూడా ఉంటాయి. పిల్లల సినిమాల మీద, పాత్రల మీద కామెంట్స్ ఉంటాయి.

మీరు సినిమాల్లో 'ముదురు' పిల్లల్ని చాలా మందిని చూస్తున్నారు. ఇవన్నీ హీరో, హీరోయిన్ల ప్రేమలకు లింకుగా వాడుకుంటు న్నారు. కామెడీ కోసం క్రియేట్ చేస్తున్నారు. మేం నవ్వించడానికి మాత్రమే లేం. షాక్ ట్రీట్‌మెంట్ కూడా ఇస్తాం. తయారుగా ఉండండి.

అసలు మేమేం చేసినా పిల్లల కోసమే అంటారు– పెద్దలు. అవన్నీ తర్వాత. ముందు మమ్మల్ని మాట్లాడ నివ్వండి. మన తెలుగు సినిమాలకే దరిద్రం పట్టుకుంది.

ఇతర భాషల సినిమాలు చూడండి. పిల్లల్తో, పిల్లల కోసం అద్భుతమైన సినిమాలు తీస్తున్నారు.

చెప్పానుగా , ఇది ఆరంభం.

మీరు వెల్‌కమ్ అన్నా, గెటవుట్ అన్నా ఇడిసిపెట్టేది లేదు.'షో మస్ట్ గో ఆన్ !'

## ట్ర(క)ంపు తాతకో లేఖ...



"మిస్టర్ ట్రంపూ...!"

నువ్వేం మనిషివయ్యా!–అసలు నువ్వు మనిషివా, మృగానివా? చింపాంజీవా? హు ఆర్ యు? మొదలు పెట్టడమే ఎటాక్‌తో మొదలు పెట్టామనుకుం టున్నావా? ఇది నీ భాష. నిన్ను బాడీషేమింగ్ చేయటం కాదు. నువ్వు అందగాడివే. అది మేం అనటం కాదు. నీకు నువ్వే అనుకుంటావు. మొత్తం మీద నువ్వు ఓ విచిత్ర జీవివి అని మేం నిర్ణయానికి వచ్చాం. ఇంతకూ మీరెవర్రా? అని నువ్వు గర్జిస్తావు. అక్కడికే వస్తున్నా.

మేం పిల్లలం. ఇండియన్ చిల్డ్రన్. గ్రాండ్‌పా! మొదటిసారి నువ్వు అమెరికన్ ప్రెసిడెంట్ అయినప్పుడు విశ్వరూపం చూపించావు. అయినా, రెండో సారి నిన్ను అమెరికన్లు గెలిపించారు.

అది ఈ భూలోకం చేసిన గ్రేట్ మిస్టేక్. అయినా, అది వాళ్ళ తప్పుగా భావించకూడదులే. చైనాలోని జియాన్ ఎప్పుడో నీవు రెండోసారి గెలుస్తావని ప్రిడిక్షన్ చెప్పాడుగా! దేవుడు నీకలా రాసి పెట్టాడు. నీ–సుడిదిరిగింది. ఏద్దైతేనేం? అమెరికా వాళ్ళు తప్పు చేస్తే భూలోకానికి అంటగట్టడం నీకు హ్యాపీసే! అవును మరి. అమెరికాలో ఏం జరిగినా ప్రపంచమంతా అనుభవించాలి కదా!

గ్రాండ్‌పా...! మనుషులకు కొన్ని లక్షణాలు ఉంటాయి. మా 'అన్య' అంటుంది 'క్షణక్షణ ములు మారు జవరాంద్ర చిత్తములు' అని. ఎవడు అన్నాడో గాని, వాడు ట్రంపు వంశానికి చెందిన 'బ్రీడ్ గాడే' అని. నీకు క్షణంలో వెయ్యో వంతుకే ఒపీనియన్స్ ఛేంజ్ అవుతుంటాయి. నువ్వు నోరు తెరిస్తే కంపు. దుర్గంధం నాలుగు దిక్కులా పరుచుకుంటుంది.

నీకు పెద్ద పెద్ద వ్యాపారాలు ఉన్నాయంట. అవి చేసుకోక ప్రపంచం మీద ఎందుకు పడ్డావు? నువ్వు చరిత్ర చదివావా? దాంతో నాకు పనేంటి? అంటావా! ప్రపంచంలో గొప్ప గ్రాండ్‌పాలు ఉన్నారు. మేం ఇండియన్స్ కాబట్టి... గాంధీతాత గురించి చెబుతున్నాం. మా తాత నిండుగా బట్టలు కట్టుకోడు. నీలాగా సూటులు వేసుకోడు. చేతిలో కర్ర ఉంటుంది. అది జనాన్ని కొట్టటానికి కాదు.

ఈ చెంప మీద కొడితే ఆ చెంప చూపించండి. కసితీరా కొట్టమనండి. అప్పటికయినా వారికి జ్ఞానం వస్తుంది అలుపు వచ్చి, అని చెప్పాడు మా తాత. అహింస మా ధర్మం అన్నాడు. ఇప్పటికీ ప్రపంచం గాంధీతాతను గుర్తు పెట్టుకుంది. విగ్రహాలు పెట్టుకుంది.

నువ్వేంటయ్యా ! ఓరోజు యుద్ధాలు ఆపుతాను అంటావు. ఇంకో రోజు దేశాలను ఆక్రమిస్తానంటావు. అసలు ఇన్ని యుద్ధాలు ఆపినా నాకు నోబుల్ బహుమతి ఇవ్వరు అంటావు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నుండి తప్పుకున్నావు. వేలం పాటలా నోరు తెరిస్తే వందా, రెండు వందలూ, అయిదు వందల శాతం ట్యాక్స్‌లు పెంచుతా! అంటావు.

వీసాలు ఇవ్వనంటావు. అవి కావాలంటే లక్ష డాలర్లు కట్టాలంటావు. చదువుకోవటానికి రావద్దు అంటావు. ఉన్నవాళ్లని తరిమేస్తానంటావు. ఒకటా? రెండా? రోజుకో విన్యాసం.

తాతా! మన అమెరికా బతుకుతోంది– ప్రపంచదేశాల శ్రమతో. మీది అగ్ర రాజ్యామే గాని వక్ర రాజ్యం. నీలాంటి వాళ్లు మొదటి నుండీ ఉంటే అది 'అమెరికా ఐలాండ్' అయి ఉండేది. అందర్నీ రమ్మం ది మీరు. మీ జనాభా ఎంత? మీకున్న భూమి ఎంత? మా చేత చాకిరీ చేయించుకుని, మాకు పిజ్జాలు, బర్గర్లు, కోకో కోలాలు అలవాటు చేసి, మా సంపద తరలిం చుకపోయి బలిసిపోయారు. ఇప్పుడు నానా కూతలు కూస్తున్నారు.

ఇక నుండి మా ఇండియా నుండి, మా తెలుగు పిల్లల నుండి మాత్రమే కాదు. అన్ని దేశాల పిల్లలు లక్షల్లో నీకు లేఖలు రాస్తారు. మీ యుద్ధాల వల్ల, మీ ఆయుధాల వల్ల , మీ టెర్రరిజాల వల్ల పిల్లలందరూ నానా బాధలు పడుతున్నారు.

మీ బాంబుల దాడిలో అనేకమంది చని పోతున్నారు. అనాథలుగా మారిపోతున్నారు. బంకర్లలో ఆకలికి బలైపోతున్నారు. శవాల మీద పేలాలు ఏరుకుంటారా? ఎంత కాలం?

వాడు ఎవడైనా యుద్ధం చేసే ప్రతి ట్రంపూ, గింపూ నరహంతకులు. అమెరికా పిల్లల్లారా! మీరు తాతకు, అంకుల్స్‌కి లేఖలు రాయండి. వీధుల మీదకు రండి. ఈ ప్రపంచం మనది. మన పిల్లలది. రేపు మనది. ఇలాంటి కంపుగాళ్ళను మనం బహిష్కరించాలి.

ఇప్పుడు మనకు కావాల్సింది యుద్ధం కాదు. అది ఏ దేశంలో అయినా. ఆయుధాలు కాదు. పగలూ, ప్రతీ కారాలూ కాదు. లాభాలు కాదు. స్వార్థం కాదు. మనుషులంతా ఆనందంగా బతికే మంచి రోజులు!

### తాజా కలం

ట్రంప్ గాడ్ ఇరాన్ మీద యుద్ధం మెదలు పెట్టాడు. ఇరాన్ వాడు ఇంకొన్ని దేశాల మీద క్షిపణులు వదులుతున్నాడు. ఇది మూడో ప్రంచ యుద్ధంగా మారుతుందా? అని జనం హడలిఛస్తున్నారు.

వచ్చే 'కాలమ్' వరకు మనం బతికి ఉంటామా!?

# వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌పై 30 మంది గ్యాంగ్ రాళ్ల దాడి..

హైదరాబాద్, ఏప్రిల్ 8:ఒడిశా, బిహార్ రాష్ట్రాల్లో తరహాలో తెలంగాణలోనూ రైలుపై దాడి జరగడం కలకలం రేపింది. తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ లక్ష్యంగా దుండగులు రాళ్లతో దాడికి తెగబడ్డారు. గస్తీలో ఉన్న పోలీసులు అప్రమత్తమవ్వడంతో దుండగులు పారిపోయారు. ఈ క్రమంలో వారిని పట్టుకునేందుకు సినీఫక్కీలో పోలీసులు చేజింగ్ చేశారు. కానీ 30 మంది గ్యాంగ్ తప్పించుకుని వెళ్లింది. అయితే గ్యాంగ్‌లోని ఇద్దరు మహిళలు మాత్రం పట్టుబడ్డారు.

సికింద్రాబాద్ నుంచి తిరుపతి బయల్దేరిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ నిన్న రాత్రి తిమ్మాపూర్ పోలీస్ స్టేషన్ దాటుతున్న సమయంలో ట్రాక్ పక్కన 30 మంది గ్యాంగ్ మాటు వేసి ఒక్కసారిగా రాళ్ల వర్షం కురిపించింది. కిటికీలు, బోగీలకు రాళ్ళు తగలడంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. సరిగ్గా అదే సమయంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు ఆ గుంపును గమనించి అడ్డుకునే ప్రయత్నం చేశారు.

గ్యాంగ్‌ను పట్టుకునేందుకు పోలీసులు యత్నించగా.. సుమారు 30 మంది గుంపు పోలీసులనే రౌండప్ చేసి దాడికి యత్నించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అదనపు బలగాల సాయం కోరారు. దీంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ క్రమంలో వారిని కిలోమీటర్ల మేర ఛేజ్ చేశారు. కానీ నంది గామ మండలంలోని పాత జాతీ య రహదారి పక్కనే ఉన్న ఎన్‌సీ ఎల్ వెంచర్ గుండా పరుగులు తీసి చీకట్లో తప్పించుకున్నారు. కానీ ఇద్దరు మహిళలు మాత్రం పోలీసులకు చిక్కారు. వారిని బిహార్, ఒడిశా, రాజస్థాన్‌కు చెందిన ముఠాలుగా పోలీసులు అనుమానిస్తున్నారు.

అరెస్టయిన ఆ ఇద్దరు మహిళలను విచారించగా, తాము రుద్రాక్ష మాలలు అమ్ముకోవడానికి వచ్చామని చెబుతున్నారు. అయితే, అర్ధరాత్రి వేళ రైలుపై దాడికి గల కారణాలపై వారు సరైన వివరణ ఇవ్వడం లేదని, వారి వేషధారణ, ప్రవర్తనపై పోలీసులు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వీరంతా పక్కా ప్రణాళికతోనే రైళ్లను లక్ష్యంగా చేసుకున్నారా అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది.

# కె వి. రమణా రెడ్డి హాస్య మినీ కవితా శతకం "హాస్యరమణీయం" ఆవిష్కరణ




హైదరాబాద్, ఏప్రిల్ 8: (నేటినిజం ప్రతినిధి):తెలుగు యూనివర్సిటీ, నాంపల్లి హాస్య రసాన్ని చక్కగా ఆస్వాదించే వారికి మంచి ఆరోగ్యం సమకూరుతుందని సర్వే జనాఫౌండేషన్ సి. ఇ. వో, రిటైర్డ్ ఐ. ఏ. ఎస్ అధికారి బి. జనార్దన్ రెడ్డి అన్నారు. ప్రముఖ పన్నుల సలహాదారు, కవి కె. వి. రమణారెడ్డి రచించిన మినీ హాస్య కవితా సంపుటి హాస్య రమణీయం గ్రంథాన్ని నాంపల్లి లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ నాంపల్లి ప్రాంగణంలో శ్రీరస్తు సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జనార్దన్ రెడ్డి ఆవి ష్కరించారు. రమణారెడ్డి రాసిన కవితలన్నీ హాస్య రస భరితంగానూ, ఆసక్తి కారంగానూ ఉన్నాయని చెప్పి ఆయన కవిని అభి నందిం చారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ రిటైర్డ్ సేల్స్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ పరమాత్ముని వెంకట సుబ్బారావు అధ్యక్షత వహిం చారు. ఈ గ్రంథాన్ని కళారత్న, హాస్య బ్రహ్మ శంకర నారాయణ కు అంకితమివ్వడం ఒక విశేషమయితే, శంకర నారాయణకు అవధాన జీవితసత్కారం చేయడం మరో విశేషం. ఈ సందర్భంగా శంకర నారాయ ణ పన్నుల హాస్యావధానం నిర్వహించి, తమ హాస్యపు జల్లుల్లో ముంచెత్తి ప్రేక్షకులను పర వశింపజేశారు. గ్రంధావిష్క రణ కార్యక్రమం లో బెంగుళూరు వాస్తవ్యుడైన చెగు శరత్ చంద్ర కుమార్ పుస్తక సమీక్ష చేసి అనేక విశేషాలను తెలియజేశారు. సభాకా ర్యక్రమా నికి ముందు జరిగిన చాందిని కూచి పూడి నృత్యం ప్రేక్షకులను అలరిం చింది.

పేరి నరసి ంహం, భాను వ్యాఖ్యాతలుగా వ్యవహరిం చారు. శ్రీరస్తు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి కూడా అయిన రమణారెడ్డి అతి ధులందరినీ ఘనంగా సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు.



నిర్వహణ
–కందుకూరి శ్రీరాములు
–బెల్లంకొండ సంపత్ కుమార్

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం – కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

### గంగరాయి

ఒకప్పుడు కుళాయి
బోరుబావులు లేకుండేవి
ఇంటింటా ఊట బావి
చేద బావులుండేవి
తోడుకున్న వారికి
తోడుకున్నన్ని నీళ్లు ఉండేవి
బావిలోతు చేతాడు చెప్పేది
కడవ నిండే లెక్కలు
బొక్కెనకు బాగా తెలుసు
నీళ్ల తోడే రెండు చేతులు
రైలింజన్ చక్రాల రాడ్ లా
బిర బిర తండ్లాడేవి!
బావిలో దరికి కొలతలతో
ఒక గంగరాయి ఉండేది
అది ఆ సంవత్సర వర్షం
హెచ్చు తగ్గులు తెలిపేది
తెల్లవారు జామున
బావి గిరకల చప్పుళ్ళ
ఉదయభానుడికి ఆహ్వానాలు
ఊరు జనాలకుమేల్కొలుపులు
బొక్కెనతో నీళ్ళ తోడడం ఓ కళ!
గంగరాయికి బొక్కెన తగిలితే
బొక్కెన సొట్ట బుగ్గలు పెట్టేది!
అమ్మ మాత్రం జాలి పడేది!
ఇప్పుడు .గంగరాయి ముచ్చటేది!

–పట్లొళ్ళ బక్కారెడ్డి
9705315250

### ఇది 'సెల్లు' కాలం

పసిపిల్లల గొంతులోంచి
అన్నం ముద్ద సాఫీగా ప్రయాణించాలంటే
ఫోనులోని రీల్స్ కళ్ళముందు కదలాడాలి
లేదంటే ప్రయాణం ఎటో
నింగిలోని చందమామ
ఆత్మీయ పిలుపులు వినక
అల్లుళ్ల ఏడుపులు కనక
చందమామ కాస్త మొహం మాడ్చుకున్నాడు
కారణం ఈ మాయదారి చరవాణి
దీనివల్ల అనుకూలాలెన్నో అననుకులాలన్ని
ఏదైనా వాడకం తీరు.
అమ్మ ఏమైనా అంటే ఆన్లైన్ క్లాసులు అంటారు
నువ్వు కాస్త అరవకంటారు
గట్టిగా అంటే గదిని కన్నీటి గంగగా మార్చుతారు
పెద్దలు ఊరికే అనలేదు ఇది కలికాలమని
ఈ టెక్నాలజీని మోసుకొచ్చిన ఫోను
బాగా టెక్కులకు పోతున్నదిప్పుడు
పోరగాన్ల జేబుల్ల శికార్లు కొడుతున్నది
దీనికి ఎప్పుడూ యొవ్వన కాలమే
వృద్ధాప్యం రాదు అలసట రాదు ప్రయాణం ఆపదు
ఈ సెల్ ఏమో గానీ అందర్నీ సెల్ లో వేసింది

– కె.అక్షయ

### ప్రేమ లేఖలు లేని ప్రేమలు

ఇపుడు ప్రేమ లేఖలు ఎవరూ
పెన్ను పట్టుకుని
మనః పూర్వకంగా
అంకిత హృదయంతో
తెల్ల కాగితం పై రాయటం లేదు
పుస్తకంగా తేవడం లేదు.
దగ్గర కాగితం ఉండదు
పెన్ను అస్సలే వాడరు.
పక్కం కాని ప్రేమలే
ఫోను మాటలు
నాటకాలు బూటకాలు.
సెల్ ఫోనులో సంభాషించుకుని
I LOVE YOUపది సార్లు అనేసి
వలలు వేసుకుంటున్న
అమ్మాయిలు !
వేటగాడై ఆనందం పొందుతున్న
మగ పోరలు !!
అమ్మాయిది ఓటమా !
అబ్బాయిది గెలుపా !
వంద ప్రేమ లేఖలు రాసుకోని
ప్రేమలు ఇంతేగాలిలో మాటలు
గాలి ప్రేమలు
ఊపిరి రాక విడిపోయి
అపరిచితులౌతారు !
చంచల చరవాణి ప్రేమలు

–కందాళైరాఘవాచార్య
8790593638

### కాగితం

కాగితం
అక్షరాలతో నిండిపోయిన
ఓ అందమైన పూల తోట.
కాగితం
ఎండిపోయిన జీవితపు
ఎడారులను
పచ్చని పంట
పొలంలా మార్చే
ఓ జీవనది
తిమిరంలో కలిసిపోతున్న
ఈ సమాజాన్ని
వెలుగులోకి
తీసుకొని రావడానికి
అక్షరాలతో నిండిపోయిన
ఓ ఆశాకిరణం
ఒంటరి పక్షుల
బాధను పంచుకునే నేస్తం
నీ చేతి రాతతో పలకరిస్తే
పులకరించిపోయే
తీయని నేస్తం కాగితం.
కాగితం
చూడడానికి
అంబరంలా తెల్లగున్నా
రంగులు లేని జీవితాలకు
తనలోని రంగుల్నిపంచే
ఒక ఇంద్రధనుస్సు
అనాథలకు కడుపు నింపే
అమ్మ కాగితం
కాగితంతో స్నేహం చేస్తే
అంతులేని జ్ఞానం నీ సొంతం
ఎవ్వరూ దొంగలించలేని
ఎప్పుటికీ కరిగిపోని
సంపద నీ సొంతం

–పి.భవ్యశ్రీ

### అక్షరాలు

పరిమళించే అక్షరపువ్వులను జతపరిచి
వాక్యం అనే మాలగా రూపొందించాలి గాని
దాని చైతన్యపు గుబాళింపు
సమాజమంతా విస్తరిస్తుంది.
అక్షరాలకు ఓపికగా ప్రశ్నల గంధకాన్ని అద్దాలి గాని
అన్యాయం అగ్గి బూడిద అవుతుంది
అక్షరం విచ్చుకుంటే జీవితం విచ్చుకున్నట్టే
అక్షరం ముడుచుకుంటే జీవితం ముడుచుకున్నట్టే.
అక్షరాలు గేయాలను ఇవ్వగలవు
అక్షరాలు గాయాలను మాన్పగలవు
అక్షరాలు అంతం చేయగలవు
అక్షరాలు పంతం మాన్పగలవు
మనకు తెలియాల్సిందల్లా
వాటిని ప్రయోగించే విధానమే.

– మహంకాళి స్పందన

### ఈ యుద్ధం ఏ యుగానికి నాంది!

ఆగుమా ఒకపరి యుద్ధమా
పర్యవసానాలు తెలిసి
ఆధునిక హంగుల జీవనమా
పడవవై అలలపై సాగు కలిసి!
పుడమి పుట్టికి చిల్లులు వేస్తే
నువ్వొక్కడివైనా మిగులుతావా!
ఉగాది పండుగ వచ్చి
యుగారంభమని వేడుక చేసింది
యుగ యుగాల
యుద్ధ గాథలన్నీ తెలిపింది!
కురుక్షేత్ర సంగ్రామంలో
అర్జునుడి నిర్వేదం
కృష్ణుని చే భగవద్గీత బోధ
విశ్వరూపం దర్శింపజేసింది!
యుద్ధం ధర్మ సంస్థాపనార్థమని
కలి యుగం ఆసన్నమైనదని
విడమరచి తెలిపింది !
ఈ యుద్ధం
ఏ యుగారంభానికి నాంది!
యుగచక్రం
వెనుకకు తిరుగుతుందా!
కృత యుగం మళ్ళీ వస్తుందా!
పుట్టి – గిట్టిన సకల ప్రాణులు
మళ్ళీ అవే పాత్రలు
పోషిస్తాయేమో!



–పట్లొళ్ళ బక్కారెడ్డి
9705315250

### యుద్ధ మేఘం – శాంతి రాగం

ఆకాశం నిండా
ఇనుప పక్షులు
నేలంతా చిందుతున్న
రక్తపు ధారలు
హార్ముజ్ అలలపై
నిలిచిన నౌకలు
చమురు సెగలతో
రగులుతున్న ద్వీపాలు.
అధికార దాహానికి
సామాన్యులు బలి
ఆకలి కేకలతో
నిండుతున్న వీధులు
ఆయుధాల మోత
ఆగదా ఇంకా !
మానవత్వం వెలుగులు
విరియవా ఇక..
సామ్రాజ్యాల ఆటలు
ఆగిపోవాలి
లోకమంతా శాంతితో వెలగాలి



–మందాడి గోపీనాథ్
98850 45344

### తెల్ల సౌధం..నల్ల బడిపోయింది..!



ఈ యుద్ధకాండ మాకొద్దంటూ
ప్రపంచ వ్యాప్తంగా రాత్రీ పగలు
వెల్లువెత్తుతున్న ఆందోళనలు
నిరసన జ్వాలలు నింగినంటగా
తెల్ల సౌధం నల్ల బడిపోయింది..!.

ట్రంపు విధానాలు కంపు అంటూ
కోట్ల ప్రజలు ఆవేశాలు గట్లు తెగి
పుర వీధులలోన విరుచుకు పడే
నో కింగ్స్ అని.. సింగముల్లా గర్జించే...!.

నెల రోజులు భీకర యుద్ధానికి
అన్ని దేశాల ప్రజలకు కన్నీరాయే
జీవన రథానికి సరిపడ ఇంధనం లేక
బతుకు బండి మధ్యలోనే ఆగి పోయే...!.

యుద్ధంలో మృతులు అమరులు కాగా
ఆకలి యుద్ధంలో నిరు పేదలు అల్లాడే
స్వార్థం కోసం చేసిన దౌర్జన్య కాండకి
పొరుగు దేశాలు మొండి చేయి చూపే..!.

పద్మవ్యూహం లోకి వెళ్లిన పెద్దన్న
బయటకు రాలేక అయోమయం
ఇక మాటల తూటాలను పేల్చవద్దు
ఈ వార్చిచ్చును మీ ముగ్గురే ఆర్పాలి
నష్ట నివారణ చర్యలను చేపట్టాలి..!.

సరిహద్దుల లోని ఉగ్రవాదంపై
అన్ని దేశాలూ దృష్టిని సారించాలి
హద్దు మీరుతున్న ఉగ్ర దేశాలపై
నిరవధిక యుద్ధానికి
సన్నద్ధం కావాలి..!



–జి.సూర్యనారాయణ,
6281725659.

# 'సృష్టి స్వరాలు' గ్రంథావిష్కరణ




హైదరాబాద్, ఏప్రిల్ 8: (నేటినిజం ప్రతినిధి): తాత్త్విక, ఆధ్యాత్మికతకు మ్యానిఫెస్టోగా **'సృష్టి స్వరాలు'** గ్రంథం ఉందని వక్తలు అన్నారు. సుల్తాన్‌బజార్‌లో గల శ్రీ కృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయం ఆడిటోరియంలో యువ భారతి సాహితీ సాంస్కృతిక సంస్థ, ప్రమీలా శక్తి పీఠం ఆధ్వర్యంలో తెలుగు వెలుగు సమాఖ్య కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం 19వ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ ఆర్షకవి ఆచార్య మసన చెన్నప్ప రచించిన సృష్టి స్వరాలు గ్రంథావిష్కరణ జరిగింది. యువభారతి అధ్యక్షుడు డా॥ ఫణీంద్ర అధ్యక్షతన జరిగిన సభలో తెలుగు అకాడమీ పూర్వ సంచాలకులు ఆచార్య కె. యాదగిరి, సాహితీవేత్తలు ఆచార్య దేవరాజు రాంబాబు, సాధన నరసింహాచార్య, కాకరాల పద్మాకర్, డా॥బి. జయరాములు పాల్గొన్నారు. ఆధునిక కాలంలో ఆధ్యాత్మిక రచనలు చేస్తున్న ఆచార్య మసన చెన్నప్ప నిరంతర సాహితీవేత్త అని వక్తలు ప్రశంసించారు. సృష్టి స్వరాలు గ్రంథం ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లే గ్రంథమని పాఠ్యాంశంగా ఉంచవలసిన గ్రంథమని వక్తలు అభిప్రాయపడ్డారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com